


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబరు 2018

సంపుటి : 24 **288** సంచిక : 12




# తెలుగు అమృతభాష!
# తెలుగు ఎప్పటికీ వెలుగులోనే ఉంటుంది!

వేలాది సంవత్సరాలుగా తెలుగుభాష వెలుగొందుతూనే ఉన్నది. తెలుగు వేల్పుల భాష! అంత త్వరగా అదృశ్యం కాదు; అదృశ్యం అవుతుందన్న మాటల్లో సత్యం లేనేలేదు. కాకులు దూరని కారడవుల్లోనూ, చీమలు దూరని చిట్టడవు ల్లోనూ తెలుగు జీవిస్తూనే ఉన్నది. ఆ మధ్య ప్రసాదరాయ కులపతి గారు (ప్రస్తుత నామం శ్రీశ్రీసిద్దేశ్వరానంద భారతీ స్వాముల) వారు దండకారాణ్యములోని దట్టమైన అటవీ ప్రాంతాన్ని దర్శించినపుడు – ఎన్నేళ్ళనుంచో తపస్సు చేసుకుంటున్న ఆ తపసి తెలుగువాడని గ్రహించారు. ఆయనతో తెలుగులో మాట్లాడారు. ఆయనకు తియ్యదనపు కవిత్వం వ్రాసిన పోతన మహాకవి కూడా తెలియదన్నారుట. అంటే ఆయన పోతన పూర్వకపు తెలుగువాడు. పదహారణాల ఆంధ్రుడు. ఇలాటి ఆంధ్ర మహాభాగులు యెక్కడెక్కడి కీకారణ్యముల్లో ఉన్నారో! ఎవ్వరెరుగుదురు?

**ప్రముఖాంధ్ర పత్రికా బాధ్యతను నా కుమారుడు గోటేటి వెంకటేశ్వరరావు నిర్వర్తిస్తాడు. మీ ఆశీస్సులు అందజేయండి.**



**గోటేటి శ్రీరామారావు**
**7.3.1933 - 23.11.2018**

తెలుగువారు సంస్కారవంతులు. వేలాది వత్సరములుగా ఉన్నవారు. ఇలాటి సంస్కారవంతులు దుర్భరాణ్యముల్లో చీకటిని చెండాడుతూ ఉన్నారు – ప్రముఖాంధ్రను ప్రారంభించి 24 సంవత్సరాలు పూర్తియవుతున్న సంతోష శుభసమయంలో భగవంతుని అష్టైశ్వర్య ప్రదాన వ్యాసాన్ని ప్రచురించాం. సహృదయంతో చదవగలరు.



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# మీ అందరిని ఇలా పలుకరిస్తాననుకోలేదు

## ఆయన శ్వాస ధ్యాస అన్నీ ప్రముఖాంధ్ర

తలచుకుంటున్న కొద్దీ దుఃఖం ఆగటం లేదు.

జరిగిన విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను.

ఆయన ఇక లేరనే విషయాన్ని ఒప్పుకోలేకపోతున్నాను.

ఇంటిలో ప్రతి వస్తువు వెక్కిరిస్తున్నట్టుంది.

పెద్దాయనను తీసుకెళ్ళి తీసుకొస్తావనుకున్నాం ఇలా ఆయన లేకుండా తిరిగొచ్చావేమిటని నిలదీస్తున్నట్టుగా వుంది.

గత నాలుగేళ్ళలో ఆసుపత్రికి వెళ్ళినప్పుడల్లా ఒక వారముండి తిరిగి ఇంటికొచ్చేసేవారం.

కాని ఈ సారి దాదాపుగా పదిహేడు రోజులు It's a long battle. కాపాడుకోలేకపోయామే అనే బాధ ఎక్కువగా వుంది. నవంబర్ 6 నుండి నవంబర్ 23 అమావాస్య నుండి పౌర్ణమి వరకు.

అమావాస్య చీకట్ల నుండి దేదీప్యమానంగా పౌర్ణమి చంద్రుడిలా వస్తారనుకున్నాం. కానీ కార్తీక పౌర్ణమి రోజున, కార్తీకదీపం నాడు శివైక్యం చెందుతారని ఊహించలేదు. ముగ్గురన్నదమ్ములం ప్రతి నిమిషం డాక్టర్లతో మాట్లాడుతూ మా శాయశక్తులా ప్రయత్నించాం కాని దైవనిర్ణయం వేరని తెలుసుకొనలేకపోయాం.

అందరూ వయసడిగి, 85 పోనిలెండి నిండైన జీవితం అన్నారు. కానీ మేమలా అనుకోలేకపోయాం. కారణం మా జీవితాలన్నిటిలోనూ ఆయన నిండి వున్నారు.

**నాకే ఏవీ తోచడం లేదు.**

ఈ డిసెంబరుతో 'ప్రముఖాంధ్ర' 24 ఏళ్ళు పూర్తిచేసుకుని 2019 జనవరితో 25వ సంవత్సరంలోనికి అడుగిడుతోంది. ఆ ఉత్సవం ఘనంగా చెయ్యాలనుకున్నాం. అంతలోనే ఇలా జరిగిపోయింది.

చెన్నైలో నాలుగు సంస్మరణ సభలు జరిగాయి. అన్ని సభలలోనూ ముక్తకంఠంతో 'ప్రముఖాంధ్ర'ను నిలపవద్దని, ఆ పత్రికను తీసుకురావాలని కోరారు. నాకు నిలిపే ఉద్దేశం లేదు, కష్టమో నష్టమో తీసుకురావాలని వుంది.

ప్రముఖాంధ్ర మొత్తం కవర్ టు కవర్ ఆయనే రాసేవారు. నేను చివరి పేజి జీవీ రావ్ పేజీ అంటూ ఒక్క పేజీ మాత్రమే రాసేవాడిని. కాని నాన్నగారు ఎప్పుడూ అంటూ వుండేవారు ఇంకో నాలుగు పేజీలు రాయి అలవాటవుతుందని నేను వినిపించుకోలేదు, ఇప్పుడున్నట్టుండి మొత్తం సంచిక రాయాలి, ఎలా?

ఏవిటో అంతా అయోమయంగా వుంది.

ప్రముఖాంధ్రను నడపాలి, దానికి మార్గం ఆయనే చూపెడతారు. ఆ ప్రముఖాంధ్రలోనే మేము ఆ పెద్దాయనను చూసుకుంటాం. తెలుగుతల్లి భరోసా ఇస్తుందనే నమ్మకముంది. ఇంకా ఇలా చాలా విషయాలు చెప్పాలని వుంది. కొంత కొంతగా చెపుతా.

– గోటేటి వెంకటేశ్వరరావు

అదేవరో బాగా డబ్బున్నవారు, లేదా ఒక సంస్థ చెయ్యవలసిన పని ఆయన చేస్తున్నారు. హాయిగా కొడుకు, కోడలు, మనవడు, మనవరాలు ఇప్పుడు మునిమనవరాలు వారి ఆటాపాటా చూస్తూ చక్కగా కాలం గడిపెయ్యక ఆయన ఇబ్బంది పడుతూ ఆరోగ్యరీత్యా ఎందుకీ అవస్థ. ఈ సంవత్సరంతో 'ప్రముఖాంధ్ర' కు **24** ఏళ్ళు. వచ్చే జనవరి సంచిక రజతోత్సవ సంచిక. మా అమ్మగారు కాలం చేసినప్పుడు గాని ఆయన మూడుసార్లు ఆసుపత్రిపాలై మృత్యువు అంచువరకూ వెళ్ళొచ్చినపుడుగాని, ప్రెస్ పూర్తిగా నీటిపాలై మునిగినప్పుడు గాని ఆ పత్రిక ఆగలేదు, నిరాటంకంగా వస్తూనే వుంది.

ఎందుకంత శ్రమ అన్నా వినరు, నీ వల్ల కుదురకపోతే చెప్పు అంటూ బాధపడతారు. ఆయన బాధ చూడలేక నేను సరే ఈ సంవత్సరం, ఆ సంవత్సరం అంటూ **24** ఏళ్ళుగా తీసుకొస్తున్నా. మూదేళ్ళ క్రితం వరకూ ప్రతి సభ, సమావేశానికి వెళ్ళేవారు. ఆరోగ్యం అనుకూలించక కొంతకాలంగా వెళ్ళటం లేదు. ప్రతి తెలుగువారిని వారిలోని మంచితనాన్ని తీసుకుని వారి గురించి రాసేవారు. ప్రతి సభ, సమాఖ్య వారి విశేషాలు బహు చక్కగా ప్రశంసిస్తూ రాసేవారు. ఆయన వేళ్ళన్ని అరిగి ముడతలు పడిపోయాయి. రాయడానికి పట్టుండటం కోసం రకరకాల పెన్నులు తెప్పించుకుంటారు. పట్టుకోడానికి వాటంగా కాస్త లావుగా, జారిపోకుండా కాస్త గరుకుగా, ఆయనకు తృప్తి కలిగేవరకు పెన్నులు మార్చవలసిందే. అలాగే ఇబ్బంది పడుతూ తన **70** ఏళ్ళ రచనా అనుభవాన్ని ఆవిష్కరిస్తూనే వున్నారు.

అటువంటి వారు చాలా అరుదుగా వుంటారు.
నూటికి కోటికి ఒక్కరే
ఆయనే మా నాన్నగారు
శ్రీగోటేటి శ్రీరామారావుగారు
ఆయనకు నేను మాటిచ్చా
నేనున్నంతవరకూ ఆ 'పత్రిముఖాంధ్ర' వస్తుందని
ఎవరిని నమ్మి
ఆ 'తెలుగుతల్లి'ని నమ్మి
ఆ తల్లిపై అంతటి నమ్మకం
ఆ తల్లి ఇచ్చిన విద్యను అమ్ముకోవటం లేదు,
మాకు తెలిసిన విషయాలు నలుగురికి పంచుతున్నాం.
తెలుగు భాషపై ఆసక్తి పెంచుతున్నాం.
ఈ యజ్ఞంలో
మా పెద్దాయనకు నేను
నాకు మా పెద్దాయన తోడు
మాకా తెలుగు తల్లి నీడ




ఆయన (నాన్న) నన్ను
పట్టుకున్నారా?
నేను ఆయన్ను పట్టుకున్నానా?
ఆయనే నన్ను జీవితంలో
పడనివ్వకుండా,
సంప్రదాయాలనుండి చేజారి
పోకుండా,

ఒడిదుడుకుల నుండి సడలకుండా
పట్టుకున్న ఆయనే
మా నాన్న ... నా గురువు
మార్గదర్శి
ఆ ప్రక్కనే 'way to lift' అని
వుంది చూశారా
నా ఉన్నతికి కారణం ఆయనే



## నాన్న...

అన్నీ నాన్నే
నాన్నే అన్నీ
ఏమని చెప్పను
ఎంతని చెప్పను
భూమ్యాకాశాల మధ్య
దూరమంత వుంది
అంత చెప్పగలనా
లేదు అంతా చెప్పగలనా
లెక్కపెట్టలేని
లెక్కకు మించిన విషయాలను
లెక్కించి చెప్పగలనా
నాన్నా...
బీజము మీరే
నారు వేసి నీరుపోసినది మీరే
ఎదుగుదలకు మీరే
ఈ చెట్టుకు కంచె మీరే

నీడ మీరే, గోడ మీరే
అన్న ప్రాసన, అక్షరాభ్యాసం,
చదువు, సంస్కారం
ఆస్తి అంతస్థు
మనసెరిగిన మగువ
ఆ మగువతో మనువు
అంతటితో అయ్యిందా
మనవరాళ్ళ ఆలనపాలన మీరే
అన్నీ మీరే
అయినా
నేనేదో సాధించానని
నలుగురిలో సంబరపడి
మళ్ళీ మీరే గెలిచారు
మీలాంటి వ్యక్తిత్వం, వ్యక్తి
బహు అరుదు
దేవుడు నాకిచ్చిన వరం మీరు
కాదు నా పాలిట దేవుడే మీరు.

# మూర్తీభవించిన మానవత్వం

మనిషి జీవితం అంటే, కన్నతల్లి కడుపులోంచి నేలతల్లి కడుపులోకి పయనించడం. ఈ పయనం అన్ని జీవులకీ ఒకటే. కోటానుకోట్ల మంది పుడతారు, గిడతారు కూడా. కొందరు మాత్రమే యీ లోకంలో కీర్తిశేషులుగా నిలిచి పోతారు. శారీరకంగా వారు మనమధ్య లేకున్నా, వారి దివ్యస్మృతి కలకాలం జీవించివున్నవారి హృదయాలలో హిమాలయంలా నిలిచి వుంటుంది. శ్రీగోటేటి శ్రీరామారావుగారు అటువంటి వారిలో ఒకరు. వారి పేరు ముందు 'శ్రీ'నే తప్ప 'కీ॥శే॥' అనే అక్షరాలు వాడాలనిపించదు ఎందుకంటే వారు మరణించారనేది నిజంగా ఓ కల.

ఒంటరిగా మద్రాసు వచ్చి జర్నలిస్టుగా, పత్రికాధిపతిగా, నిర్మాతగా ఆయన ఎదిగిన తీరు అద్భుతం. **85** సంవత్సరాల జీవితంలోనూ ఆయన ఏనాడూ ఎవరినీ నొప్పించలేదు. అందరి కోసం బ్రతికారు. అందరినీ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. తెలుగు ఆయన శ్వాస. మంచితనం మూర్తీభవిస్తే అది శ్రీగోటేటి శ్రీరామారావుగారిలా ఉంటుందని అందరికీ తెలుసు. సాహిత్యంలో ఆయన స్పృశించని ప్రక్రియ లేదు. చిట్టచివరి వరకూ అక్షరార్చన చేస్తూనే వున్నారు.

ఎంతమంది సద్గురువులు వారికి ఆశీస్సులిచ్చారూ! ఎన్ని సంస్థలు వారిని సన్మానించి తమ సమర్ధతని చాటుకున్నాయి!

ఎన్ని సభలు వారి ఉపన్యాసాలతో తరించాయీ! ప్రపంచంలో ఎన్ని దేశాలు ఆయన్ని ఆహ్వానించి తెలుగుపై తమకున్న ప్రేమని చాటుకున్నాయి! లెక్కకట్టడం సులభం కాదు!

ఎన్ని సువర్ణ కంకణాలు... ఎన్ని శాలువలు... ఎన్ని పూల కిరీటాలు ఆయన్ని చేరి తరించాయి!

బిడ్డలకు ఎవరైనా ఆస్తుల్ని పంచుతారు. శ్రీరామారావుగారు మాత్రం వారి బిడ్డలకి 'తెలుగుపై మక్కువ' ని పంచారు. ఎవరేమన్నా వినయంగా మెలిగే గుణాన్ని పంచారు.

ఎవరిలో ఎంత చిన్న టాలెంట్ వున్నా మనస్ఫూర్తిగా మెచ్చుకుని వారిని ఉత్సాహపరిచే తన స్వభావాన్ని పంచారు.

అయినా వారెక్కడికి వెడతారూ?

ఆధ్యాత్మ రామాయణాన్ని తెలుగులో చక్కగా వ్రాసిన శ్రీరామారావుగారు, శ్రీసీతారామలక్ష్మణ భరత శతృఘ్ను హనుమాన్‌లతో వుంటారు. రాముడు రాముని సమక్షంలోకి చేరాడంతే!

వారి నిర్వహణ దీక్షకి 'ప్రముఖాంధ్ర' ఓ అద్భుతమైన ఉదాహరణ.

ఒక్కటి మాత్రం నిజం. మద్రాసులోని తెలుగువారు మరో ఆత్మబంధువుని కోల్పోయారు. అదీ స్వచ్ఛమైన హృదయమున్న ఆత్మబంధువుని.

వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి బిడ్డలందరికీ యీ 'ఎడబాటు'ని భరించగల నిబ్బరాన్ని ఆ భగవంతుడు ఇవ్వాలనీ మనఃస్ఫూర్తిగా కోరుకుంటూ శ్రీగోటేటి రామారావుగారికి హృదయ వందనాలు అర్పిస్తూ...

నమస్సులతో

**భువనచంద్ర**

శ్రీజగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

# కాలము అనర్ఘము



**ముహూర్త మాత్రేతికాన్తే భగవచ్చిన్తనం వినా ।**
**దస్యుభిర్ముషితేనేవ యుక్తమాక్రన్దితుంద ధ్రువమ్ ॥**

భగవచ్చిన్తనతో జీవనం సాగించాలి. అందుకు భిన్నంగా సంచరించేవారు అవివేకులన్నమాట. శంకర భగవత్‌పాదులు ఇలా చెప్పారు. ముహూర్తం అంటే 48 నిమిషాలు. ఆ మాత్రం సమయమైనా దైవధ్యానం చేయాలి. లేకపోతే ఆ తరువాత చాలా బాధపడాలి. చాలా కష్టపడి ధనాన్ని సంపాదించి ఒక ఇంట్లో ఒకాయన డబ్బు దాచుకున్నాడనుకోండి. ఒక దొంగ ఆ యింట్లో ప్రవేశించి ఒక గడియారం అపహరించాడు. డబ్బు, ఇతర వస్తువులు అక్కడే ఉన్నాయి. అవి పోలేదు. ఒక గడియారం మాత్రమే పోయినా ఆయన ఎంత బాధపడిపోతాడో!

ఈ ప్రపంచంలో ఏ వస్తువు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. గడచిన కాలమును మాత్రం తిరిగి పొందలేము. ఎంత ధనం ఖర్చుచేసినా అది తిరిగి రాదు. కాని తిరిగిపొందగలిగే వస్తువు పోతేనే జనం బాధపడతారు. చూస్తూనే కాలమును వృథా చేస్తారు. ఏ మాత్రం బాధపడరు. కనుకనే శంకర భగవత్ పాదులు 'భగవత్ చింతనలేకుడా ఒక ముహూర్తం గడిచిపోయినా బాధపడాలి' అన్నారు. ఈ విషయాన్ని మనసులో ఉంచుకొని రాబోయే నూతన సంవత్సరం నుంచి అయినా ప్రతి ఒకరు కాలగతిని గమనిస్తూ కొంత సమయమైనా కేటాయించి దైవచింతన చేయాలి. దైవచింతన చేసి ప్రజలు శ్రేయస్సును పొందెదరు గాక!

# తెలుగువారికి తీరని లోటు

మా సంస్థ జనని ప్రారంభించిన తొలిదశలో నాకు విద్వాన్ దశరథరామిరెడ్డి గారు శ్రీగోటేటి శ్రీరామారావుగారిని పరిచయం చేశారు. మా సంస్థ నిర్వహించే కార్యక్రమాలు తరచుగా వారి నిర్వహణలోని 'ప్రముఖాంధ్ర' మాస పత్రికకు పంపేవాడిని. అలా మాకు, మా సంస్థకు పెద్దలు శ్రీగోటేటి శ్రీరామారావుగారు ఎంతో ప్రాచుర్యం కల్పించారు.

మేము వారిని సాదరంగా మా సంస్థ కార్యక్రమాలకు ఆహ్వానించేవారం. వారు సుదూరం అని కూడా చూడకుండా వచ్చి పాల్గొని మమ్ముల ప్రోత్సహించేవారు.

ఇవి ఎందుకు చెబుతున్నాను అంటే ఎవరైనా కాని వారిని ప్రోత్సహించాలి అనే మంచి మనసుగల మహామనిషి అని చెప్పటానికే.

ఒకసారి వారు వెలువరించే ప్రముఖాంధ్ర పత్రికను విశేష సంచికగా వెలువరించారు 2003 ఏప్రిల్‌లో. అందులో దాదాపు 30 మంది ప్రముఖుల గురించిన వివరాలు పొందుపరిచారు. అది అంత సులభమైన పనికాదు. కాని వాటిని సేకరించడమే కాక వారి వారి ఛాయా చిత్రాలతో కూడా ప్రచురించటం కొనియాడదగిన విషయం. పుస్తకములో పుటలు నింపడం కాదు ఆయన ఉద్దేశం. భావితరాలకు గతించినవారి గొప్పదనాన్ని తెలుగు భాషకు వారు చేసిన సేవలను తెలియచేయడమే వారి లక్ష్యం. ఇది వారి పట్టుదలకు ప్రతీక.

చిత్రమైన విషయమేమిటంటే అది 1969 అనుకుంటాను. అక్కినేని నాగేశ్వరరావు చలనచిత్ర రజతోత్సవం సందర్భంగా పద్మశ్రీ అక్కినేని అనేక ప్రత్యేక సంచికను వెలువరించారు. అందులోనూ అక్కినేని గురించి 'ఆంధ్ర కళామతల్లి సుపుత్రుడు' అనే వ్యాసం రాశాను. ఆయన ఎవరో ఏమిటో తెలియనపుడు వారి నిర్వహణలో వెలువడిన పుస్తకములో నా వ్యాసం రావడం. వారే తరువాత కాలములో ఇంకొక పండితోత్తముని ద్వారా పరిచయం కావడం నా భాగ్యంగా భావిస్తున్నాను.

తరువాత తరువాత కాలములో వారితోపాటు వారి కుటుంబ సభ్యులతోనూ నాకు పరిచయభాగ్యం కలిగింది. నన్ను వారిలో ఒకనిగా చూసుకునేవారు. వారే కాదు ఆ యింటిలో అందరూ కూడా.

నాపై ఆయనకు ఎంతో ప్రేమ, ఎంత నమ్మకమో ఒక సంఘటన చెపుతాను. రాజభవన్‌లో వారు రాసిన 'గోటేటి గీతలు' పుస్తకావిష్కరణ కార్యక్రమము, మహామహులు గవర్నర్‌తో సహా పాల్గొనే కార్యక్రమమది. ఆ కార్యక్రమానికి నన్ను వ్యాఖ్యాతగా వుండమని ఆయన ఆదేశించడం అది నాకు పరవశము కలిగించింది. కార్యక్రమము ముగిసిన మీదట బాగా నిర్వహించావని అని అయన అభినందించిన ఆ సన్నివేశం మరువలేనిది. మరపురానిది. ఇది ఆయన గొప్పతనమునకు ఓ నిదర్శనము.

మరో విషయం చెప్పి ముగిస్తాను. 2001 డిసెంబరు సంచికలో నా గురించి 'గువ్వల చెన్నా- నా గుడిమెట్ల చెన్నయ్యాను గూర్చి ఏమని చెబుతానంటూ వ్రాసిన ఆ ఆశీర్వచనాలు నా ఎదుగుదలకు సోపానాలు.

అటువంటి భాషా సేవకులైన మంచి మనసున్న మనిషిని కోల్పోవడం నాకు తీరని లోటు. నాకే కాదు తెలుగుజాతికి తీరని లోటు. వారి ఆత్మకు శాంతికలుగాలని కోరుకుంటున్నాను.

**– గుడిమెట్ల చెన్నయ్య,** ప్రధాన కార్యదర్శి, 'జనని'




# సాహిత్యలోకంలో చిరస్మరణీయుడు

ఒక కలం ఆగింది!

అది ఎన్నో కలములను కదిలించిన మహా కలం..

నిత్య చైతన్యంతో నిలిచిన మనిషి కలం..

దాదాపు ఏడు దశాబ్దాలుగా అక్షర ప్రవాహాన్ని సాగించిన కలం..

నరనరాన్న తెలుగు సాహిత్యం పల్లవించిన కల్పవృక్షం...

మానవతకు సుగంధం..

అభ్యుదయానికి అలంకారం..

తెలుగు వ్యక్తిత్వానికి, అస్తిత్వానికి, పౌరుషానికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం..

ఆ కలం పేరే – "గోటేటి శ్రీ రామారావు" గారు!!

తెలుగు సాహిత్యం అంటే వారికి తపస్సు, తెలుగు అక్షరానికి వారి పేరు ఒక తేజస్సు. కాలంతో పాటు ప్రయాణించారు. కాలికస్పృహతో సృజించారు. ఎక్కడా ఆగిపోలేదు, నిలిచిపోలేదు. ఏడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య ప్రపంచాన్ని దీప్తిమంతం చేయడం కోసం అహర్నిశలు శ్రమించారు. బాలరాజ్యం, మధురిమ, మధురవాణి, సినీరమ, ప్రముఖాంధ్ర వంటి పత్రికలను నడిపించ డమే కాకుండా అధ్యాత్మ రామాయణం, శ్రీకృష్ణ వంటి గొప్ప గొప్ప రచనలు చేస్తూ జీవితమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా వెలిగిన సరస్వతీ పుత్రుడు "గోటేటి శ్రీ రామారావు" గారు.

ఈ రోజు వారు మన మధ్య భౌతికంగా లేరు కానీ వారి రచనలు సజీవంగా మనతో మాట్లాడుతూనే వుంటాయి. తెలుగు భాషాభివృద్ధి కోసం వారు వేసిన బాట మన కళ్ళ ముందే ఉంది. ఆ బాటలో పయనించటమే మనం చేయవలసిన కర్తవ్యం. వారి ఆశయంతో ముందుకు పోవటమే వారికి నిజమైన నివాళి.

ఆ మహానుభావుకుడు పరమేశ్వరునిలో ఐక్యం పొందాలని ఆశిస్తూ....

– శ్రీకాంత్ కానం

తెలుగు తల్లి పాదారవిందాల
సుమరాజమా
చిరస్మరణీయానురాగోజ్వల తేజో
రూపమా
ప్రముఖాంధ్ర మాసపత్రిక సృజనోన్నత
విజయశీల
మాతమతుల్యారతవరులు రాలేరు
శ్రీ గోటేటి రామారావు మహా సౌగుణ్యమా
అమరలోకానికేగిన మహార్ద్రుత
కవితాత్మకు శాంతి శాంతి శాంతిః

దైవజ్ఞాని
విద్వాన్ కోశ్రీ, చెన్నై-49.



# నేతా మునిరత్నం నివాళి

జీవీరావుగారూ, నమస్తే మా గురుతుల్యులు శ్రీయుతులు గోటేటిగారి మరణం తెలుగువారందరికీ తీరనిలోటు. 1964లో ఆంధ్ర బాలానంద సంఘం శ్రీ ఆత్రేయగారి 'కప్పలు' నాటకాన్ని ప్రదర్శించారు. అందులో అందరూ టి.నగర్‌వాళ్లే. నేనొక్కణ్ణే ST నుండి ఆ నాటకంలో హాస్యపాత్ర పోషించాను. నాటి మేటి నటులు శ్రీకాంతారావుగారితో కలిసి మా గోటేటిగారు ఒద్దిక (రిహార్సల్సు)లకు వచ్చి మా హాస్య సన్నివేశాలకు బాగా నవ్వుకొని, అభినందించేవారు. అప్పట్నుంచి నాకు శ్రీగోటేటిగారితో అనుబంధం. తిరుమల గుబ్బా సత్రం వార్షికోత్సవాలలో ప్రతియేటా మా ఇద్దరికీ ఒకే గది కేటాయించేవారు. వారితో ఎంతో సాన్నిహిత్యం ఏర్ప డింది. నా నాటక ప్రస్థానం గురించి 'ప్రముఖాంధ్ర'లో ప్రచురించి ప్రోత్సహించారు. TTD వారు ప్రవేశపెట్టిన 'సుదర్శనం' టోకెన్ల గురించి వ్యాసం రాయమన్నారు. శిరసా వహించి రాశాను. దాన్ని కూడా 'ప్రముఖాంధ్ర'లో ప్రచురించారు. నాకు 70 పూర్తి అయినప్పుడు కూడా నా గురించి 'ప్రముఖాంధ్ర'లో రాశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని మనసారా ప్రార్థిస్తున్నాను. మీ కందరికి ప్రగాఢసానుభూతి. మీ బలం మీకు తెలీదు. ధైర్యంగా ముందడుగు వేయండి. విజయం వరిస్తుంది నా ఆకాంక్ష. ఇందువెంట చిన్న మొత్తం పంపుతున్నాను. దయచేసి పెద్దమనసుతో స్వీకరించాల్సిందిగా ప్రార్థిస్తున్నాను.

భవదీయుడు **నేతా మునిరత్నం**

# శ్రీ రామారావు గారు కారణజన్ములు

**నిజం...**

**కాకపోతే...**

* తమిళనాడులో తెలుగుభాషా పతాకాన్ని వినువీధిలో ఎగురవేయగలిగి ఉండేవారా!
* తెలుగు సారస్వతంపై మక్కువ కలిగినవారు సినీపత్రికలను అత్యంత ఆదరణీయంగా నడుపగలిగియుండేవారా! సినీ నిర్మాతగానూ మారి విజయాలను అందుకొనగలిగియుండేవారా!
* సినీప్రముఖులతో పరిచయాలేకాక, వారితో ఘన సన్మానాలను పొందగలిగి ఉండేవారా!
* లౌకికదృష్టిగల సినీతారల చేతనే కాకుండా పారలౌకికదృష్టి కలిగిన పీఠాధిపతుల ఆశీఃపూర్వక సత్కారాలను పొందగలిగి ఉండేవారా! విద్యావిశారద బిరుదాంకితులు కాగలిగియుండేవారా !
* 80 సంవత్సరాల వయస్సు దాటినప్పటికీ తన సంపాదకీయంలో "ప్రముఖాంధ్ర" పత్రికను 22 దేశాల తెలుగు పాఠకులకు అంద జేయగలిగి ఉండేవారా!
* వృద్ధాప్యంలోనూ అధ్యాత్మ రామాయణము, శ్రీకృష్ణ వంటి ఉత్కృష్ట ఉద్గ్రంథాలను రచించి ఆస్తికాగ్రేసరునిగా నిలువగలిగియుండేవారా!
* వారి స్వగృహంలో.. వారిని నేను సందర్శించినప్పుడు నన్ను స్పృశిం చిన తీరు, సంభాషణలో వారు ప్రదర్శించిన వాత్సల్యానికి ధన్యుడనైనాను.

కారణజన్మునికి స్మృత్యంజలి సమర్పిస్తూ..

– **బోరంచ మనోహర్,** అపర్ణ సరోవర్, హైదరాబాద్

# శ్రీమతి ఇందిరా దత్ గారికి మా కృతజ్ఞతలు



ప్రముఖాంధ్ర, ప్రపంచ తెలుగు సమాఖ్య రెండూ ఒకే వేదిక మీద ఆవిష్కరింపబడ్డాయి. అపుడు 1994లో చెన్నైలో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావ సభలోనే ప్రముఖాంధ్ర తొలి ప్రతి శ్రీ ఎన్.టి.ఆర్.గారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడింది. అంతేగాదు ఆ పత్రికకు మొట్టమొదటి అడ్వర్టయిజ్‌మెంట్ శ్రీదత్‌గారే ఇచ్చారు. దానికి నాన్నగారు మొట్టమొదటి ప్రముఖాంధ్ర సంచికలు అచ్చువేసి ఆ రెండు రోజుల సదస్సుకు వచ్చిన వారందరికీ ప్రముఖాంధ్ర పత్రికలను వితరణ చేసారు. శ్రీ దత్‌గారు, శ్రీమతి ఇందిరాదత్ గార్ల హస్తవాసి మంచిది, రాశి అయినది. అందుకే ఆ పత్రిక ఎన్ని ఆటుపోటులొచ్చినా 24 సంవత్సరాలు నిరాటంకంగా వెలువడింది.

మొన్న ప్రపంచ తెలుగు సమాఖ్య నాన్నగారి సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఈ విషయాలన్నిటినీ నేను జ్ఞాపకం చేస్తూ నా భావాలను పంచుకున్నాను. అంతకు ముందు మాట్లాడిన వక్తలందరూ ప్రముఖాంధ్ర పత్రికను నడపాలని, దానికి తమ వంతు సహాయాన్ని అందిస్తామని తెలిపారు. సభ చివరగా అధ్యక్షులు శ్రీమతి ఇందిరాదత్‌గారు నాతో మాట్లాడుతూ ఒక అపీల్ ఇవ్వండి, నా వంతు సహాయం నేను చేస్తానని అడిగారు. అప్పుడు నాన్నగారు అక్టోబర్ 25న శ్రీమతి ఇందిరాదత్‌గారికి ఒక ప్రకటన కావాలని రాసి పోస్ట్ చెయ్యని ఉత్తరాన్ని మేడమ్‌గారికి అందజేసాను. వెంటనే స్పందిస్తూ తానే 25వ సంవత్సరం రాబోయే 12 ప్రముఖాంధ్రల స్పాన్సర్ పేజీ తీసుకుంటానని అప్పటికప్పుడు సభాముఖంగా ప్రకటించారు. ఆ సభ శనివారం జరిగింది. నాకు సోమవారం వారి హైదరాబాద్ ఆఫీసు నుండి పత్రిక సైజు అడగడం ఆ రోజే సాయంత్రం ప్రకటన డిజైన్ పంపించడం, మరుసటి రోజు మంగళవారం వారి చెన్నై ఆఫీసు నుండి ఫోన్ రావటం చెక్కు రెడీగా ఉంది వచ్చి కలెక్ట్ చేసుకోండి అని చెప్పడం, అన్నీ చకా చకా క్షణాల్లో జరిగిపోయాయి.

శ్రీమతి ఇందిరాదత్‌గారు చెప్పడం, చెయ్యడం అన్నీ ఏకధాటిన క్షణాల్లో జరిగిపోయాయి. అదే వారి స్పెషాలిటి.

ఒక సంవత్సరంపాటు బ్యాక్ కవర్‌పేజీ అడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వడం, అదీ మా సంస్థపై నమ్మకముంచి 12 నెలల చెక్కును అక్షరాల మూడు లక్షల రూపాయలు ఒకేసారి ఇవ్వడం నేనూహించనిది. శ్రీమతి ఇందిరాదత్ గారికి పత్రికా ముఖంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ మేడమ్‌గారి హస్తవాసి వల్ల మళ్లీ ఆ పత్రిక తన ప్రయాణాన్ని నూతన ఉత్సాహంతో పెద్దలైన శ్రీ గోటేటి శ్రీరామారావుగారి ఆశీస్సులతో నిరాటంకంగా సాగుతుందని మనవి చేసుకుంటున్నాను.

\- గోటేటి వెంకటేశ్వరరావు

## ప్రముఖాంధ్ర ఆగదు

**2018 డిసెంబర్ 27వ తేదీనాటికి 'ప్రముఖాంధ్ర' పత్రికను స్థాపించి 24 సంవత్సరాలు పూర్తియవుతున్నది. 2019 జనవరి నుంచీ ప్రచురింపబడే 'ప్రముఖాంధ్ర' సంచికలు రజతోత్సవ సంచికలని తెలియజేస్తూ, మీ శుభాశీస్సుల కొరకు ఎదురుచూస్తున్నాం.**

\- గోటేటి వెంకటేశ్వరరావు

# మరచిపోలేను



శ్రీగోటేటి శ్రీరామారావుగారు లేరన్న వార్తను ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాను.

మాకు ఎంతో ఆప్తులు, శ్రేయోభిలాషులు, మితభాషి, హితభాషి, నిగర్వి, నిరాడంబరులు, సాహిత్యరత్న, విద్యావిశారద శ్రీగోటేటి శ్రీరామారావుగారు ఎలా ఉన్నారని నవంబరు 23వ తేదీన వారి పెద్ద కుమారుడు జీవీ రావుగారికి ఫోన్ చేశాను. ఈ రోజు ఉదయం నాన్నగారు కాలం చేశారని చెప్పారు. వెస్టు మాంబళంలో ఉన్న నేను గబగబా అశోక్‌నగర్‌లోని వారి ఇంటికి వెళ్ళాను.

శ్రీరామారావుగారి భౌతిక శరీరాన్ని దర్శించాను. చాలా సంవత్సరాలుగా సన్నిహిత సంబంధం వున్న నాకు గత జ్ఞాపకాలు మెదిలాయి. తెరలుగా గుర్తుకు వచ్చి నాలోంచి దుఃఖం గంగా ప్రవాహంలాగా పొంగివస్తుంటే ఇంక ఆపుకోలేక అక్కడ నుండి బయటకు వచ్చేశాను. కాస్సేపు అయ్యాక తమాయించుకుని మళ్ళీ లోపలికి వెళ్ళి వారి పిల్లలను ఓదార్చాను.

ప్రేమ, ఆప్యాయత, అభిమానం, గౌరవ, మర్యాదలకు రాశీభూతమైన సాకార రూపమే శ్రీగోటేటి శ్రీరామారావుగారు. నేను ఎప్పుడు వారి ఇంటికి వెళ్ళినా (రాత్రి అయినా, పగలు అయినా) 2, 3 నిమిషాలు మాట్లాడి రాంప్రసాదుగారు ముందు కాఫీ తాగండి... తరువాత మనం మాట్లాడుకుందాం అనేవారు, మిమ్మల్ని చూస్తుంటే మా నాన్నగారు, మా తాతగారు గుర్తుకు వస్తున్నారని అనేవాడిని. ఆయన వాళ్ళని మహానుభావులు అని అనేవారు.

ఒకసారి సాహిత్య సార్వభౌమ, కవి చక్రవర్తి అయిన, నాకు తాతగారైన శివశ్రీ మల్లంపల్లి మల్లికార్జున శాస్త్రిగారి ఫోటో శ్రీరామారావుగారికి చూపించాను. ఈ ఫోటోలోనే దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నారు. ఎవరో మహానుభావుల్లా ఉన్నారు. వీరి గురించి మీరు వ్రాయండి. మేము మా 'ప్రముఖాంధ్ర'లో ప్రచురిస్తాం అన్నారు.

2012, మే ప్రముఖాంధ్ర సంచికలో నేను మా తాతగారి గురించి రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. అలాగే 2016 నవంబరు 'ప్రముఖాంధ్ర' సంచికలో నేను శ్రీమల్లికార్జున సమేత జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి మీద రాసిన వ్యాసం ప్రచురించి నన్ను ఆశీర్వదించి ప్రోత్సహించారు.

అవిశ్రాంతంగా 24 సంవత్సరాలు 'ప్రముఖాంధ్ర'ను శ్రీరామారావుగారు అసిధారావ్రతంగా ప్రచురించారు. ప్రముఖాంధ్ర ద్వారా తెలుగుభాష కోసం ఎనలేని సేవచేశారు. తెలుగుభాషకు చేసిన సేవ అపారము. అనితర సాధ్యమూ. 84వ పడిలో కూడా ప్రముఖాంధ్రను ఒక్క చేతితోనే రాసేవారు. తెలుగువారి పేరు ప్రఖ్యాతులు ప్రపంచ వ్యాప్తంగా దేశదేశాల్లో ప్రముఖాంధ్ర ద్వారా తెలియచేశారు. వ్యాపార నిమిత్తం కాకుండా కేవలం తెలుగు భాష కోసం, తెలుగువారి గొప్పతనాన్ని ప్రపంచానికి ప్రముఖాంధ్ర ద్వారా తెలియచేశారు.

చెన్నై మహానగం ఒక ప్రముఖ సంపాదకుని, గొప్ప రచయితను కోల్పోయింది. పాత తరానికి చెందిన ఒక ధ్రువతార రాలిపోయింది. తెలుగువారు ఒక పెద్ద దిక్కును కోల్పోయారు. వారులేని లోటూ ఎవరూ తీర్చలేనిది. ఒక గొప్ప ఆత్మీయుణ్ణి, దగ్గిర బంధువుని కోల్పోయినంత బాధగా ఉంది.

బంధువులు, ఆయన సన్నిహితులు ప్రముఖాంధ్ర అభిమానుల మనస్సుల్లో శ్రీరామారావుగారు సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. శ్రీరామారావుగారు తెలుగువారు అవటం తెలుగువారికే ఒక గర్వకారణం.

39 సంవత్సరాలుగా భక్తుడిగా ఉన్న నాకు ఇప్పటికీ ఎన్నో మహిమలు చూపిస్తూ దర్శనం ఇచ్చి, నన్ను, నా కుటుంబాన్ని కాపాడుతున్నట్లుగానే శ్రీరామారావుగారి కుటుంబానికి ఈ బాధను తట్టుకునే శక్తిని, ఎదుర్కొనే ధైర్యాన్ని ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకి సుమారుగా 12 కి.మీ దూరంలో ఉన్న శ్రీమల్లికార్జున సమేత జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారు సదా కాపాడాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నాను.

పద్యం :

**భక్తుల చిత్తమందు భక్తి ప్రపత్తుల కొలవగా మహా**
**శక్తితో, భీతితో నిలిచి రాసిగా మొక్కులు మొక్కి వేడగా**
**శక్తులు జూపి బాధలను సాంతము బాపును జొన్నవాడలో**
**శక్తిగా వెలసే కంచిపుర సాధ్వియే భక్తుల కోర్కె దీర్చన్**

శ్లోకం

**కామాక్షీ సమేతాయా కామితార్థ ప్రదాయినే**
**యజ్ఞవాటిక నివాసాయా మల్లినాధాయా మంగళం॥**

ఇట్లు

ఆ మల్లికార్జున సమేత జొన్నవాడ కామాక్షమ్మ పాద రేణువు

**మల్లంపల్లి రామప్రసాదు**




*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# ఆటపాటల పూతోట తెలుగు అక్షరమ్మల ఆట
# మాణిక్యమే పాట మాణిక్యం
# మా యింటి అబ్బాయి మంచి మాణిక్యం
## -ఎంతటి అక్షర రమణీకృతమున్నదో చూడండి-

ఒక్కొక్క అక్షరములో ఒక్కొక్క శబ్ద రమ్యతను సంతరించుకున్న భాష తెలుగుభాష! దీర్ఘహ్రస్వములు, ద్విత్వాక్షరములూ, త్రిత్వాక్షరములు, చతురాక్షర సంయుక్తములను సరళముగా సుందరంగా పలుకుబడి గల భాష తెలుగు ఒక్కటే! క్లిష్ట సంక్లిష్ట పదములను కూడా సరస సరళ స్వరసమ్మిళితంగా తెలుగుభాష నందు పలికే సౌలభ్యమున్నది. అందుకే అజంతా భాషగా తెలుగును పేర్కొన్నారు. సుందర తెలుంగు యని అరవపండితులు ప్రశంసించారు. క్లిష్టపదములు లేని భాష. లఘు గురువులను సహితమూ ఎంతో చక్కని అక్షఋ సమాహారంతో పలుకవచ్చు. పిల్లల ఆటపాటలనే తీసుకుందాం.

పూర్వకాలం తెలుగు బాలల భాషా బోధన వినోదాత్మకంగా వుండేది. వాసి కెక్కింది కూడా. 'కొత్త ఆంధ్ర వాచకం' ఇది 'వెంకట్రామా అండ్ కో' వారు ప్రచురించేవారు. 'పెద్దబాలశిక్ష'ను పుదూరి సీతారామ శాస్త్రిగారు రచించారు. ఇంకా లోతుకెళ్ళితే 'అమరకోశం' 'శబ్దమంజరి'లను వల్లె వేయించేవారు.

చిన్నయసూరి 'నీతిచంద్రిక' గద్య రచనకే వన్నె తెచ్చినది. శతక పద్యాలు, నీతి కథలు, సూక్తులతో తరగతి గదులు ప్రతిధ్వనించేవి. ప్రాథమిక విద్యలో పూర్తిగా ఒకటవ తరగతిలో అక్షరాలు, అంకెలు, ఎక్కాలు నేర్పించడానికే కేటాయించేవారు. పునాది గట్టిపరిచేవారు. ఇంగ్లీషు పెద్దబడి, చిన్నబడి కూడా నేర్పేవారు. గుణింతాలు, వత్తులు, వర్ణక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు. ఉచ్చారణ లోపాలను సరిదిద్దేవారు. అజంత భాషయైన తెలుగు పరిపుష్టమైన ఉచ్చారణ కలది. 'అమ్మ' అను పదం మన మాతృ భాషకు ఊపిరి వంటిది. కష్టాలలో తలిచేది అమ్మనే కదా! నక్షత్రాల పేర్లు, వారాలపేర్లు- ఆటపాటలలో పొదిగి చెప్పేవారు. మచ్చుకొకటి.

**'ఆదివారము నాడు అరటి మొలచింది**
**సోమవారము నాడు సుడివేసి పెరిగింది**
**మంగళవారము నాడు మారాకు తొడిగింది**
**బుధవారము నాడు బుద్ధిగా పెరిగింది**
**గురువారము నాడు గుబురుగా లేచింది**
**శుక్రవారము నాడు గెలవేసి ఎదిగింది**
**శనివారము నాడు చకచక కోసితిమి'**

బడిలో తోట పెంచేవారు. అందరు కలిసి ఆనందంగా ఆ అరటి పళ్ళను తినేవారు. వారాల పేరు వొంటబట్టేది.

ఊయలలో పసిపాపను పరుండబెట్టినపుడే 'జో



అచ్యుతానంద, 'లాలి పరమానంద రామగోవింద' జోజో ముకుందా అని జోలపాడి నిదురపుచ్చేవారు. అన్నమయ్య, త్యాగయ్య, పోతన, వేమన మనభాషకు ఊపిరులు పోసారు.

బిడ్డ అన్నం తినకపోతే చందమామను చూపిస్తూ ఊరుకోబెట్టేవారు- ఆ క్రమంలోదే ఈ క్రింది పాట

**'చందమామ రావె జాబిల్లి రావె**
**కొండెక్కి రావె కోటపూలు తేవె**
**బండెక్కి రావె బంతిపూలు తేవె**
**తేరుమీద రావే తేనెపట్టు తేవె**
**పల్లకిలో రావె పాలు పెరుగు తేవె**
**అన్నిటినీ తెచ్చి మా అబ్బాయికి కీవే!**

చంకలో పిల్లవాడు ఆసక్తిగా వినేవాడు తల్లి పాడే పాటను. ఆ మరుపులో అమ్మముద్ద, నాన్నముద్ద అంటూనే తినిపించేవారు. పిల్లలు వానలో తిరుగుతూ పాడే పాట

**'వానా వానా వల్లప్ప!**
**వాకిలి తిరుగు చెల్లప్ప!**
**తిరుగలేను మల్లప్ప!**

కాగితపు పడవలు వానలో వదలుతూ, ముసి ముసి నవ్వులు నవ్వేవారు. ఒకరి చేతిలో ఒకరు తప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ ఈ క్రింది పాట పాడేవారు.

**చెమ్మ చెక్క చేరడేసి మొగ్గ**
**అట్లుపొయ్యంగ ఆరగించంగ**
**ముత్యాల చెమ్మచెక్క ముగ్గులెయ్యంగ**
**రత్నాల చెమ్మచెక్క రంగులెయ్యంగ**
**పగడాల చెమ్మచెక్క పందిరెయ్యంగ**
**పందిట్లో మా బావ పెళ్లి చెయ్యంగ**
**సుబ్బారాయుడి పెళ్లి చూసివద్దాం రండి**
**మా ఇంట్లో పెళ్ళి మళ్లీ వద్దాం రండి!**

పిల్లలు ముఖ్యంగా మరదళ్లు బావగార్ని హాస్య మాడే ఘట్టం చూడండి.

**బావా బావా పన్నీరు**
**బావను పట్టుకు తన్నేరు**
**వీసెడు గంధం పూసేరు!**
**వీపున గుద్దులు గుద్దేరు!**

-అని పరాచకాలాడేవారు. విందును వినోదాన్ని అందించే ఈ పాట పరికించండి.

**బుర్రుపిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది**
**అత్త తెచ్చిన కొత్తచీర కట్టనన్నది**
**మామ తెచ్చిన మల్లెపూలు ముడువనన్నది**
**మొగుడిచేత మొట్టికాయలు తింటానన్నది.**

బాలబాలికల్లో బాల్యం నుంచే భక్తి భావం పెంపొందింప చేసేవారు. శ్రీకృష్ణుని గూర్చి-

**'చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ**
**బంగారు మొల త్రాడు పట్టుదట్టి**
**సందెతాయెత్తులును సరిమువ్వ గజ్జలు**
**చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు'**

మరొకటి మచ్చుకు-

**'తారంగం! తారంగం!**
**తాండవ కృష్ణా తారంగం!**
**వేణునాథ తారంగం!**
**వేంకటరమణా తారంగం!**

**నీవే తల్లివి తండ్రివి**
**నీవే నా తోడు, నీడ**
**నీవే గురువు దైవము**
**నీవే నా పతియు, గతియు**
**నిజముగ కృష్ణా!**

ఇంకా

**కాళ్లాగజ్జి కంకాళమ్మా**
**వేగుల చుక్క వెలగమొగ్గ**
**మొగ్గకాదు మోదుగు వీరు**
**బావి కాదు బచ్చలి కూర**
**కూర కాదు కుమ్మరి మెట్టు**

అని పాడుతూ కాలుతీసి పక్కన పెట్టమనేవారు. ఆటపాటలతో మునిగి తేలే తెనుగు బిడ్డల ఆటలు చూడండి

**అప్పడప్పడ తాండ్ర!**
**అయ్యవారి తాండ్ర**
**గుళ్ళో తాండ్ర! గుడిమీది తాండ్ర!**
**రాజుగారి చెవి పట్టుకో**
**గుయ్యో! గుయ్యో! గుయ్యో!**

అని పిల్లలందరు పాడుతూ, ఒకరి చెవి మరొకరు పట్టుకుని లాగుకుంటూ ఘొల్లున నవ్వేవారు. ఆ

బాల్యం జీవితంలో తిరిగి ఎవరికీ రాదు. ఇప్పటి పిల్లలకు ఆటలు, సరదాలు గగనకుసుమాలే! ఈ పాటను గమనించండి!

**'బుజ్జిమేక బుజ్జిమేక ఏడకెళ్తివి?**
**రాజుగారి తోటలోన మేత కెళ్తిని**
**రాజుగారి తోటలోనే ఏమి చూస్తివి?**
**రాణిగారి పూల చెట్ల సొగసు చూస్తిని**

ఒక ప్రశ్న దాని సమాధానం పై పాటలో ద్యోతకమవుతుంది. చదువనేది తరగతి గదుల్లోనే కాదు ఆరుబయట కూడా దొరుకుతుంది. చిన్న పిల్లల్లో మంచి అలవాట్లను పెంపొందించడానికి గురువులు పాటల రూపంలో కూడా బోధించేవారు.

**తెల్లవారక**
**ముందే నిదురలేవాలి**
**తెల్లగ పండ్లను తోముకోవాలి**
**గోరువెచ్చని నీట స్నాన మాడాలి**
**ఉతికిన దుస్తులు వేసుకోవాలి**

అని విద్యా బుద్ధులు సమపాళ్ళలో గరిపేవారు. పిల్లలు అన్ని రంగాలలో ఆరితేరునట్లుగా అభినయ గేయాలు, ఆయుర్వేద రహస్యాలు దాగిన గేయాలు, వినోదాత్మక గేయాలు, కుటుంబ బాంధవ్యాలని పటిష్ట పరిచే గేయాలు నేర్పించారు - శతక పద్యపఠనం ద్వారా విద్యార్థులలో నైతిక బలాన్ని పెంపొందించే వారు. కథలు, సూక్తులు ద్వారా మంచిని ప్రోది చేసేవారు.

మన సమాజంలో నాగరికత పెరిగేకొలది మాతృ భాష మీద అనాసక్తి కలుగుతోంది. జీవన విధానంలో సంబంధ బాంధవ్యాలు కూడా సన్నగిల్లుచున్నవి. పూర్వం సమష్టి జీవన విధానంలో ఉన్న ఆప్యాయత లకు, వినయ విధేయతలకు ఈ కింది పాట పరికించండి.

**'కలవారి కోడలూ - కలికి కామాక్షి**
**కడుగుచున్నది - పప్పు కడవలో పోసి**
**అపుడే వచ్చెను - ఆమె పెద్దన్న!**
**కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీరు నింపె**
**ఎందుకు కన్నీళ్ళు? ఏమి కష్టాలు!**
**తుడుచుకో చెల్లెలా**
**ముడుచుకో కురులు**
**పోయి మీవారితో చెప్పి రావమ్మా!**
**పట్టె మంచం మీద పడుకున్న మామ**
**మా అన్నలొచ్చారు మమ్మంపుతార!**
**నేనెరుగ నేనెరుగ- నీ అత్తనడుగు**
**కుర్చీపీట మీద కూర్చున్న అత్త!**
**మా అన్నలొచ్చారు మమ్మంపుతార?**
**నేనెరుగ నేనెరుగ - నీ బావనడుగు**
**భారతము చదివేటి బావ! పెద బావ!**
**మా అన్నలొచ్చారు - మమ్మంపుతారా**
**నేనెరుగ నేనెరుగ - నీ అక్కనడుగు**
**వంటచేసే తల్లి వంటింటి అక్క**
**మా అన్నలొచ్చారు మమ్మంపుతార!**
**నేనెరుగ నేనెరుగ - నీ భర్త నడుగు**
**రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి**
**మా అన్నలొచ్చారు - మమ్మంపుతారా**
**కట్టుకోచీరనూ - పెట్టుకో సొమ్ములు**
**ఎత్తుకో బిడ్డను - ఎక్కువ అందలము**
**పోయిరావమ్మ నీ వారితో**
**పుట్టింటికిని సుఖముగాను**

పురిటికి వెళ్ళడానికి ఎంతమంది అనుమతి తీసుకోవలసి వచ్చిందో చూడండి! అప్పటి కట్టుబాట్లు అటువంటివి. పిల్లల చదువుల్లో పొడుపు కథలు కొన్ని చోటుచేసుకునేవి.

**కిట కిట తలుపులు**
**కిటారి తలుపులు**
**ఎప్పుడు తీసినా**
**చప్పుడు కావు!**
**తండ్రి గరగర**
**తల్లి పీచుపీచు**
**బిడ్డలు రత్నమాణిక్యాలు**
**మనుమలు బొమ్మరాళ్ళు**
**మొదలగునవి మరికొన్ని ఆటల్లో**
**గుడు గుడు కుంచం గుండేరాగం**
**పావడ పట్టం పటిక బెల్లం**

వేడినీళ్ళో చన్నీళ్ళో మాకేం తెలుసు అని గుప్పెడు గుప్పెడు పెట్టి పైన వేలుపెట్టి తిప్పుతూ ఆడేవారు.

క్రీడాభిరామం శ్రీనాథుడు. వినుకొండ వల్లభ రాయలు వ్రాసిన వీధినాటకం. దానిలో శ్రీకృష్ణ దేవరాయలన్నట్లు మంచి పద్యం కలదు.

**తెలుగుదేల యన్న దేశంబు తెలుగేను**
**తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్లనృపులు గొలువ నెఱుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగు లెస్స**

మన జీవన సంస్కృతిలోనే భాష ఆచార వ్యవహా రాలు సాంప్రదాయాలు మిళితమైనవి. అవే పలు ప్రాంతాలలో తెలుగునాట పండుగ పబ్బాలందు వెల్లడగుచున్నవి. మన రాజకీయ, సాంఘిక, సాంస్కృ తిక జీవన విధానము మాతృభాషతో అనుసంధానింప బడియున్నవి. అనాది నుంచి పదుగుపేకల వలె విద్యాభ్యాస దశలోనే జీవన సంస్కృతి మేళవింపబడేది. విద్యార్థి మనో వికాసమునకు తొలి అడుగు నిర్దిష్ట ముగ, నిర్దుష్టముగ నుండెడిది. అనాది నుంచి జీవన విధానంలో ఆనుషంగికమైన మాతృభాషను విస్మరించుట తెలుంగులకు అసలు తగదు. 'అభ్యా సము కూసువిద్య'. మాతృభాష అభ్యాసము పటిష్టంగా లేని పై చదువులు వ్యర్థము. మాతృభాషరాని విద్య పునాది లేని కట్టడము వంటిది. ఆంధ్రుల మనసు ఆప్యాయతానురాగాలకు నిలయము. ఆతిథ్యమునకు పెట్టిన పేరు. కావున 'ఆంధ్రత్వమాంధ్రభాషచ', 'స్వదేశ వేషభాషయా మప్రమదితవ్యమ్' అను ఆర్యోక్తి అనుల్లంఘ్యము. అక్షర సత్యము.

**-అనిపెద్ది జగన్నాథశాస్త్రి,** తెలుగు విద్యార్థి

# రాజీపడని పత్రికా సంపాదక చక్రవర్తి ముట్నూరి కృష్ణారావు

**పత్రికా రచయితల్లో మహరాజుగా బ్రతికారు!**

**కృష్ణాపత్రికను మహారాజసంగా నడిపారు!! ఎవరికీ తలవొంచని రాజసమది!**

**విమర్శించవలసివచ్చినపుడు ప్రాణమిత్రుణ్ణి సహితమూ విడిచిపెట్టే వారు కాదు!**



ఒకసారి ఆయనకు అత్యంత ఆత్మీయుడైన పట్టాభి సీతారామయ్యనే విమర్శించారు. సత్యము ముందు ఎవరినీ ఉపేక్షించేవారు కారు. విచిత్రమేమంటే తలపాగాను క్రిందపెట్టి తాను మామూలుగా కూర్చునే కుర్చీలో కూర్చుని పట్టాభి నా మిత్రుడు, పట్టాభిని ఎవరేమన్నా సహించను' అన్నారు. అదీ ఆయన నిజాయితీ! పత్రికా సంపాదకునికీ, మామూలు మనిషికీ గల తేడాను నిర్భయంగా చాటి చెప్పారు.

అప్పటి విద్యలో ఆయన ఎఫ్.ఏ. పట్టభద్రుడు. ఇంగ్లీషు భాషలో ఆయన ఘటికుడు. కానీ ఆయన లెఖ్ఖల్లో (మేథమెటిక్స్‌లో) మార్కులు వచ్చేవి కావు. ఎప్పుడూ తప్పుతూనే (ఫెయిలవుతూనే) ఉండేవారు. ఆంగ్లంలో మాత్రం అనర్గళ ప్రతిభావిశేష సంపన్నులు. ఆయన ఎఫ్.ఏ. చదివే రోజుల్లో బి.ఏ. విద్యార్థులకు ట్యూషన్లు చెప్పేవారు. షేక్స్పియర్ నాటకాలన్నీ ఆయనకు కంఠతా వచ్చు. ఆ రోజుల్లో ఆంగ్లం బోధించడంలో వెంకటరత్నం నాయుడుగారికి మంచి పేరుండేది. కృష్ణారావుగారి ఆంగ్లభాషా వైదుష్యాన్ని చూచిన నాయుడుగారు ఓ గంటసేపు అలాగే నిశ్చేష్టులై చూచారు. కృష్ణారావుగారు పాఠం చెప్పడం అయ్యాక వెళ్ళి కౌగలించుకుని- విద్యార్థివైనా నా కంటే నీవే ఆంగ్ల పాఠం బాగా చెప్పగలిగావు అంటూ మెచ్చుకున్నారు, గాఢంగా కౌగలించుకున్నారు. కృష్ణారావుగారు 'కృష్ణాపత్రిక' సంపాదకత్వం నెఱపిన రోజుల్లో ఖర్చులు పోను వంద రూపాయలు మాత్రమే మిగిలేవి. ఆ వంద రూపాయలతోనే కుటుంబ పోషణం చేసుకునేవారు. ఆర్థికవేత్త, చేతివేళ్ళతోనే లెఖ్ఖలను కట్టి చెప్పకలిగే మేధావియైన భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు మూడు నాలుగువేల రూపాయలు ఖర్చుపెట్టి ప్రెస్సును కొనివ్వగా, ఆ ప్రెస్సులోనే ఆయన కృష్ణాపత్రికను ముద్రిస్తూ నిర్వహించారు. పొదుపులో ఆయన ఘట్టి మదుపరి. గాంధీగారికి సునాయసంగా చేతి వేళ్ళలో లెక్కలు గట్టి చెప్పేవారు. అందుకే గాంధీగారు పట్టాభిని ద్విభుజంగా భావించేవారు. ఆ పట్టాభి సహితమూ ముట్నూరి కృష్ణారావుగారిని గౌరవించేవారు. అంతటి ప్రజ్ఞాశీలియైన పత్రికా రచయిత ముట్నూరి కృష్ణారావు పత్రికా సంపాదకులెల్లరకూ ఆదర్శప్రాయుడు.

# భగవంతుడు అష్టైశ్వర్య స్వరూపుడు! అష్టైశ్వర్యము లొసగువాడూ ఆయనే!

## -ఆయన స్వరూపులైన మీ అందరికీ వందనములు-

దైవ స్మరణముతోనే అష్టైశ్వర్యములనూ పొందవచ్చును. అష్టైశ్వర్యములను ఆయన ప్రసాదిస్తున్నాడు. మానవాభ్యున్నతినే ఆయన కాంక్షిస్తూంటాడు. ఆయన అష్టైశ్వర్య ప్రదాత.

ఆయన ప్రసాదించిన అష్టైశ్వర్యములను ముందుగా తెలుసుకోవలసిన అవసరం కావున అవేవో సంక్షిప్తంగానైనా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

ఆయన మొదటిగా కల్పించినది జలం. జలం లేకుండా మానవుడు జీవించలేడు. జలం సర్వత్రా ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో నదీనదముల ద్వారా గోచరిస్తుంది. మరికొన్ని ప్రదేశాల్లో అట్టడుగున ఉంటుంది. జలమే మొదటి జీవాధారమని గ్రహింపచేసాడాయన. కావున జలమును మొదటి స్వరూపంగా ధరించాడు. రెండవది అగ్ని. అగ్ని ద్వారానే సకలమ్మూ వికసింపజేస్తూ, ప్రకటింపచేస్తున్నాడాయన. అగ్నియే మానవుని జఠరాగ్నిగా నిరూపణమైనది. మానవుడు తాను భుజించిన ఆహారమును రసముగా మార్చి తదుపరి రక్తము, మాంసము, కండరములను, ఎముకలు వంటి సప్తస్థితులుగా మార్చి దేహమును పోషిస్తూ వస్తున్నది. దీనినే సప్తధాతులుగా నిరూపించారు. ఈ సప్తధాతువులే లేకున్న జీవితము క్షణ కాలము కూడా నిలువదు.

మూడవది భూమి. ఈ భూమిపైననే సమస్త జీవజాలము, జీవనమును కొనసాగిస్తున్నది. ఈ భూమిపైననే జనన మరణములన్నీ సాగుతున్నాయ్. ఆహారపదార్థములన్నీ ఈ భూమిపైననే లభ్యమవుతున్నాయ్. అందుకే భగవంతుణ్ణి భూస్వరూపుడనీ భూమానందుడనీ కొలుస్తున్నాం.

నాలుగవది గాలి. మనము క్షణక్షణమూ గాలిని పీల్చుకుంటూ, వొదుల్తూంటేనే ప్రాణిగా మనగలుగుతాం. దానినే శ్వాస అంటాం. శ్వాసలేని జీవి విగత జీవి.

ఐదవది ఆకాశము. సర్వజీవరాశుల జీవనానికీ అవకాశమిస్తున్నది. ఆకాశము యొక్క గుణము శబ్దము. శబ్దములేకపోతే జీవి ఉన్నట్లు కాదు. జీవశ్చవము. ఎక్కడ శబ్దమున్నదో అక్కడ ఆకాశమున్నదనుకోవాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసములన్నీ ఆకాశమువే! తత్కారణముగానే మనము జీవనము గడుపుతున్నాం. మేఘాల కవకాశం కల్పించి, వాయువుతోడుతో వర్షములు కురిపించి, పంటలను పండింప చేస్తున్న పరమ పవిత్రమైనది ఆకాశం.

ఆరవది సూర్యుడు. సూర్య బింబము నుంచీ వెలువడు శక్తుల వల్లనే సమస్త జీవులూ జీవించగలుగుతున్నాయి. మేధోశక్తి, జీవనశక్తీ ప్రబలుతూన్నది.

ఏడవది చంద్రుడు. చంద్రుని యొక్క చల్లని శక్తి జీవిని ప్రశాంత పరుస్తున్నది. చంద్రుని యొక్క ప్రతిబింబమే మనస్సు. మనస్సు యొక్క ప్రశాంతతయే మానవుని ప్రధాన లక్ష్యము. ఈ లక్ష్యము నుండే లక్షణములన్నీ ఉద్భవించాయ్.

సూర్యుని నుండీ భూమి వచ్చింది. భూమి నుండీ చంద్రుడుద్భవించాడు. కావున సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే పదార్థ జనితములు. విభాగములని కూడా చెప్పవచ్చు. ఈ మూడింటియందూ ఎట్టి బేధములూ లేవు. మానవుని ఆకారమునందూ, మనో బుద్ధి విజ్ఞానమైన రూపాలు ధరిస్తూంటాయ్.

ఎనిమిదవది వేద ప్రమాణము. ప్రణామము అంటేనే సత్యమైనదని తెలుసుకోవాలి. 'సత్యం నాస్తి పరోధర్మః' అన్నారు. సత్యాన్ని మించిన పరమధర్మం లేదు. భగవంతుడు నిత్యుడై నిరాకారుడై జగత్తునందు ఆకారములతో ఆవిర్భవిస్తూంటాడు. ఆ ఆవిర్భావంలో అష్ట రూపములనూ దర్శింపచేస్తూంటాడు. అష్టైశ్వర్యములను అనుభవించినా, అష్టకష్టాలను పొందినా– అవన్నీ భగవదనుగ్రహాలే! భగవంతుని ఇచ్ఛాపూర్వకంగానే జరుగుతూంటాయి. ఆయన మంచి చేసినవారికి మంచినీ, చెడునూ వారి క్రియా ధర్మములను బట్టి నిర్దేశిస్తూంటాడు. దీనినే



పెద్దలు భగవదనుగ్రహం అంటున్నారు. భగవదనుగ్రహం కారణంగానే మంచి చెడులూ, లాభనష్టాలూ, కష్ట సుఖాలూ సంభవిస్తూంటాయ్.

మంచి చేసినచో మంచి నిలుచును, చెడు చేసినచో చెలిమికలిములు దూరమగునని గ్రహించాలి. మనకు మంచి జరగాలనుకున్నప్పుడు మంచిగానే మసలాలి. మంచి పనులే చేయాలి. మంచి మార్గాన్నే నడవాలి. అలాటప్పుడు యెట్టి బాధలూ కలుగవని శాస్త్రం తరచి తరచి చెబుతూన్నది. ఎట్టి బాధలూ కలుగకుండా ఉండడానికి ఘట్టి ఘట్టి మంచిపనులనే చేద్దాం; మంచి వారిలో ఘటికులనిపించుకుందాం.

**- గోటేటి శ్రీరామారావు**

**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***

# ఘనతను మనకిచ్చి గగనానికి గోటేటి

ఇలా చెన్నై స్పందించిన తీరు అమోఘం. నాన్నగారి మరణంతో కుటుంబ సభ్యులేకాక చాలామంది ఆయన శ్రేయోభిలాషులు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్కసారిగా వారిలో ఆయనకున్న అనుబంధాన్ని తలచుకున్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇలా అందరి మనసులలోనూ ఆయన స్థానం సుస్థిరం. అది మాకు గర్వకారణం. అందరిమాట ఒక్కటే ప్రముఖాంధ్ర నిలిచిపోకూడదు. ఆ పత్రిక రావాలి. మాకు నిలపాలని లేదు. కాస్త శ్రమ, చెప్పుకోలేని ఇబ్బందులన్నా ఆ పత్రికను తీసుకురావాలన్నదే మీ అభిమతం కూడా. ఆ పత్రికలో మేము మా నాన్నగారిని చూసుకుంటాం. మా శాయశక్తులా ఆ పత్రికను అదే విలువలతో తీసుకురావడానికి మా వంతు కృషిని చేస్తాం. ఒక్క మాట నిజం. ఆయన లేని లోటు తీర్చడం కష్టం. కాని ఆ ప్రముఖాంధ్ర పత్రికని ఆయన్ని జ్ఞాపకం చేసుకుంటూ కలకాలం అందరి హృదయాల్లో గుర్తుండిపోయేలా మా వంతు ప్రయత్నములు చేస్తాం. చెన్నైలో ఆయనకు నివాళులర్పిస్తూ నాలుగు సభలు జరిగాయి. శ్రీ జేకే రెడ్డిగారు, శ్రీద్రవిడ దేశం కృష్ణారావుగారి ఆధ్వర్యంలో ఒక సభ, ఆలిండియాతెలుగు ఫెడరేషన్ మరియు తెలుగు బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఒక సభ, ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఒక సభ, తేజస్-తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్ వారి సంస్మరణ సభ. ఈ నాలుగు అసోసియేషన్లు శ్రీగోటేటి శ్రీరామారావుగారి వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని, తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడాయి. అందరూ ముక్తకంఠంతో చెప్పిన విషయం ప్రముఖాంధ్ర పత్రిక కొనసాగింపు.

## ధన్యజీవి శ్రీగోటేటిగారు

ఆయన ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రముఖాంధ్రను పత్రికను నడిపారు. ఎక్కడెక్కడి వార్తలో సేకరించి, ప్రచురించి చాలామందికి ఉచితంగానే పత్రికను 287 మాసాలు అంటే 24 యేళ్లపాటు నిర్విరామంగా నడిపారు. ఆ పత్రిక అలాగే రావాలని మా చెన్నపురివారందరి కోరిక. ఇదివరకే మా వేదవిజ్ఞానవేదిక తరపున పదివేల రూపాయలు అందజేసాం. ఆ పత్రిక కొరకు ఇంకా చేస్తామని ఆ పత్రిక తీసుకురావాలని మా కోరిక.

– **శ్రీ జె.కె. రెడ్డి,** ప్రముఖ ఆడిటర్, ఆస్కా సాంస్కృతిక కార్యదర్శి, వేదవిజ్ఞాన వేదిక మేనేజింగ్ ట్రస్టీ

## గోటేటి శ్రీరామారావు నాకు పితృ సమానులు

గోటేటి శ్రీరామారావుగారు ఇక లేరనే విషయాన్ని ఒప్పుకోలేక పోతున్నానని, ఆ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన నేను చేసే ప్రతికార్యక్రమాన్ని ఒక సైనికుడిలా చేస్తున్నావు అంటూ వెన్ను తట్టి ప్రోత్సహించేవారని, ఆయన ద్రవిడ దేశం తరపున రెండుసార్లు సత్కరించుకున్నామని, మరోమారు ఈ అక్టోబర్ రెండు గాంధి జయంతి రోజున సత్కరించాలనుకున్నప్పుడు ఆయన ఆరోగ్యం బాగాలేదని తెలిసినదని, తెలుపుతూ ఆయన ఓ తండ్రిలా తనను ప్రోత్సహించేవారని ఆయన మరణం తండ్రిని పోగొట్టుకున్నంతగా కలచివేసింది.

– **శ్రీకృష్ణారావు,** అధ్యక్షులు, ద్రవిడదేశం

## గోటేటి శ్రీరామారావుగారి మరణం తీరని లోటు

గోటేటి శ్రీరామారావుగారు నాకు 35 ఏళ్ళుగా పరిచయం ఉంది. ఆయన అందరికి కావలసినవారు. అందరిని కలుపుకొనిపోయేవారు. ఆయన సినిమా పీఆర్ఓగా వున్నప్పట్నుంచి నాకు పరిచయం. పత్రికా రంగంలో ముక్కుసూటి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలోని అన్నివర్గాలవారితో సత్సంబంధాలు వున్నాయని, ఆయన ఆసుపత్రిలో ఉన్నారని ఫోన్‌చేస్తే వెళ్ళి చూసాను. వైద్యులు వారు చెయ్యగలిగినదంతా చేశారు. కాని ఆయన ఆరోగ్యం బాగా విషమించినందువల్ల ఆయన్ను కాపాడుకోలేకపోయాం. ఆయన అజాతశత్రువు. చెన్నపురిలో ఆయన్ను తెలియని తెలుగువారుండరు. ఆ ప్రముఖాంధ్ర ద్వారా ఆయన స్వదేశంలోనే కాక విదేశాలలో కూడా ఖ్యాతినార్జించారు. ఆ పత్రిక ఆగిపోకూడదు. అది నడవాలని నా కోరిక

– **ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి,** ప్రముఖ వైద్యులు అధ్యక్షులు, ఆల్ ఇండియా తెలుగు ఫెడరేషన్

## గోటేటి గారితో 40 ఏళ్ళ బంధం

నాకు గోటేటి శ్రీరామారావుగారితో 40 ఏళ్ళ పరిచయం వుంది. 1980-85 ప్రాంతాల్లో విజయవాడలో మాకు సినిమా డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ వుండేది. అప్పట్లో శ్రీరామారావుగారు ప్రఖ్యాత సినిమా జర్నలిస్ట్. తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన చేసిన సేవలు మరువరానివి. ఆయన మాటకు విలువ, సినిమా రివ్యూకు పేరుండేది. ఆయన ఎవరినీ విమర్శించకపోయినా సుతిమెత్తగా ఆయన అనుకున్నది చెప్పేవారు. ఇంకొకరిని నొప్పించేవారు కాదు. అప్పట్లో విజయవాడలోని గాంధీనగర్‌లో ప్రతి డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులోను ఆయన గోటేటి ఫిలిం డైరెక్టరీ వుండేది. ఆయన ఆ డైరెక్టరీని 25 సంవత్సరాలు తీసుకువచ్చారు. ఆ తరువాత ఆయన సినీరమ సినిమా పత్రికను నడిపారు. అప్పుడు జిల్లాలవారిగా సినిమాలు కొనడం ప్రారంభించిన తొలి రోజులు. ఆ విషయంగా నేను ఆయనకు ఫోను చేస్తూ ఆయన చెప్పిన దానిని బట్టి సినిమాలు కొన్ని కొంటూవుండేవాడిని. అలా ఆయనతో నాకు సన్నిహిత పరిచయం ఏర్పడింది. సినిమా ఇండస్ట్రీలో ప్రతివారూ ఆయన్ను గౌరవించేవారు. అంతేకాదు ఇప్పుడు నేను ప్రెసిడెంట్‌గా వున్న సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జర్నల్ వారి ప్రెస్‌లోనే 25 సంవత్సరాలుగా ప్రింట్ అవుతోంది. ముఖ్యంగా ఆయన సూచనలు తీసుకునేవాడిని. ఆయన లేరనే విషయం చాలా బాధ కలిగించింది. ప్రముఖాంధ్ర పత్రికను గత 24 ఏళ్ళుగా నేనూ అందుకుంటూనే వున్నాను. ఆ పత్రికకు నావంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా వున్నానని సభాముఖంగా తెలియచేసుకుంటున్నాను.

– **శ్రీ కాట్రగడ్డ ప్రసాద్,** ప్రముఖ నిర్మాత, పంపిణీ దారులు, అధ్యక్షులు ది సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్




## గోటేటి సేవలు ఎనలేనివి

తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ప్రముఖాంధ్ర సంపాదకులు దివంగత గోటేటి సేవలు ఎనలేనివని ప్రపంచ తెలుగు సమాఖ్య సంతాప సభలో వక్తలు కొనియాడారు. ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో తెలుగు భాషా సేవకులు గోటేటి శ్రీరామారావు సంతాపసభ డబ్ల్యూటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు వీఎల్ ఇందిరాదత్తు ఈ సభకు అధ్యక్షత వహించారు. ముందుగా గోటేటి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఇందిరాదత్తు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రారంభం, గోటేటి శ్రీరామారావు ప్రముఖాంధ్ర ప్రారంభం ఒకేరోజు జరిగాయని, అంతే కాకుండా సమాఖ్య మొదటి సదస్సులో ప్రముఖాంధ్ర మొదటి సంచిక ప్రారంభమైందని తెలిపారు. పత్రికా సంపాదకుడిగానే కాకుండా ప్రపంచ తెలుగు సమాఖ్య జరిపే కార్యక్రమాలన్నింటిలో గోటేటి పాల్గొంటూ వారి సహకారాన్ని అందించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన పాత్రికేయ రంగానికే కాక, తెలుగు భాషకు చేసిన సేవలు ఎనలేనివని, గోటేటి సేవలను స్మరించుకున్నారు. అనంతరం సమాఖ్య ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు మాట్లాడుతూ 1994 సంవత్సరం నుంచి గోటేటి శ్రీరామారావుతో పరిచయం ఉందని, ఆంధ్ర కళాస్రవంతి తరపున కొరట్టూరు అగ్రహారంలో కట్టించిన శ్రీకోదండరామాలయాన్ని సందర్శించి ఆ గుడిని గురించి ప్రముఖాంధ్రలో రాశారని గుర్తు చేసుకున్నారు. సమాఖ్య కోశాధికారి శివరామ ప్రసాద్ మాట్లాడుతూ 63 ఏళ్లుగా ఆయన పత్రికా రచయితగా పేరు ప్రఖ్యాతులు గడించారని, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ సినిమా పత్రిక సంపా దకుడిగా ఉన్నప్పటి నుంచి గోటేటి తెలుసని అన్నారు. ఉపాధ్యాయురాలు డాక్టర్ ఏవి శివకుమారి మాట్లాడుతూ గోటేటి శ్రీరామారావు తెలుగు భాషకు గొప్ప సేవలు చేశారని పేర్కొన్నారు. వీరితోపాటు పలువురు తెలుగు ప్రముఖులు మీరా శేఖర్, సత్యాదేవి, గోటేటి సేవలను కొనియాడారు.

ప్రముఖాంధ్ర పత్రికను ఇలాగే కొనసాగించాలని వక్తలు ఆకాంక్షించారు. వీటన్నింటికి స్పందిస్తూ గోటేటి కుమారుడు గోటేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ని వ్యయప్రయాసలకు ఓర్చి అయినా సరే పత్రికను నడిపిస్తానని తెలిపారు. ఆ పత్రికలోనే మా నాన్నను చూసుకుంటూనే ఆయన ఆశయాన్ని నెరవేరుస్తానని తెలిపారు. దానికి స్పందించిన ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వీఎల్ ఇందిరాదత్ ఒక సంవత్సరంపాటు ప్రముఖాంధ్ర పత్రిక్రను తానే స్పాన్సర్‌గా ఉంటానంటూ దానికి అయ్యే ప్యాట్రన్ పేజీకి రూ. 3 లక్షలు ఇస్తానని సభాముఖంగా ప్రకటించారు. ఇందులో సమాఖ్య సెక్రటరీ శ్రీ లక్ష్మీమోహన్‌రావు, మహిళా విభాగానికి చెందిన సురేఖ, ఆంధ్ర కళా స్రవంతికి చెందిన ఎంఎస్ మూర్తి, పి. సరస్వతి, సురేష్‌బాబు, జీవి రమణ పాల్గొని గోటేటికి నివాళులర్పించారు.

## గోటేటి జీవితం అనుసరణీయం సంస్మరణ సభలో తేజస్ నివాళి

వివిధ రంగాల్లో ముఖ్యంగా పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలందించిన గోటేటి శ్రీరామారావు సుదీర్ఘ జీవితం జర్నలిస్టులందరికీ అనుసరణీయం, ఆదర్శనీయమని తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్ (తేజస్) పేర్కొంది. పాత్రికేయునిగా సుదీర్గ జీవితాన్ని అనుభవించి తెలుగు భాషకు ఎనలేని సేవలు చేసిన ప్రముఖాంధ్ర మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకులు, తేజస్ వ్యవస్థాపక సభ్యుడు గోటేటి శ్రీరామారావు గత నెల 23న చెన్నైలోని ఆయన స్వగృహంలో కన్నుమూసారు. ఈ సందర్భంగా చెన్నైలోని ఆంధ్రా సోషల్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) పెన్నా హాలులో సోమవారం తేజస్ బృందం సమావేశమై ఘనంగా శ్రద్ధాంజలి ఘటించింది. గోటేటి శ్రీరామారావు చిత్రపటానికి తెలుగు పాత్రికేయులందరూ పుష్పాంజలి ఘటించారు.

### మహోన్నత వ్యక్తిత్వం

కార్యక్రమంలో ముందుగా తేజస్ అధ్యక్షుడు గుండ్ల సంజయ్ మాట్లాడుతూ గోటేటితో తన అనుభవాలను పంచుకున్నారు. జీవిత జ్ఞాపకాలను మరువలేమని, అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆయన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా కొనియాడారు. ఆయన జీవితంపై తాను చేసిన డాక్యుమెంటరీకి ప్రవహిత పాత్రికేయుడిగా టైటిల్ సూచించినట్లు తెలిపారు. విలువలు కలిగిన పాత్రికేయం గురించి ఆయన నుంచి నేర్చుకోవచ్చన్నారు. ఎస్‌కేఎండీ గౌస్ బాషా మాట్లాడుతూ తేజస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన కూడా ఒకరన్నారు. తేజస్‌కు ఏదైనా చేయాలని తపించిన వ్యక్తి అన్నారు. వృత్తిపరంగా కమిట్‌మెంట్, పెరిగేకొద్దీ ఒదిగి ఉండాలన్న మనస్తత్వంతో జీవించినట్లు తెలిపారు.

### ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి

నందగోపాల్ మాట్లాడుతూ అనేక కోణాలున్న నక్షత్రంలా ఆయన ప్రతిభకు సైతం అనేక కోణాలున్నాయని అన్నారు. భువి నుంచి దివికేగిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కీర్తించారు. నేటికీ ఏనాటికీ ఆయన ఎడబాటు పాత్రికేయ రంగానికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ఆయనకు నివాళులర్పించారు. విజయకుమారి, అరుణ్ గోటేటి శ్రీరామారావుతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

## తెలంగాణా భాష యాసలకు పట్టం కట్టింది

# పాకాల యశోదారెడ్డి

### భాషకు యాస సొగసు కూరుస్తుంది, ప్రాంతీయ భాషా సౌరభాల్ని వికాసింపచేస్తుంది



తెలంగాణా యాస భాషలకు పట్టం కట్టిన రచయిత్రి, కవయిత్రి పాకాల యశోదారెడ్డి. ఆమె రాసిన 'మా ఊరి ముచ్చట్లు' ఎందరినో ఆకట్టుకుంది. మా ఊరి ముచ్చట్లు కథా సంపుటిలో 1920–40 మధ్య కాలం నాటి తెలంగాణా గ్రామీణ జీవన విధానాన్ని చిత్రించారామె. ఆమె 'ఎచ్చమ్మ కథలు' పేరుతో కథా సంపుటిలోని కథలు 1950–70 మధ్య కాలం నాటి తెలంగాణా సంస్కృతి ప్రతీకలుగా నిలిచాయి. 'ధర్మశాల' కథా సంపుటిని 2000 సంవత్సరంలో వెలువరించారు. ఈ సంపుటిలో 1980–90 మధ్యకాలం నాటికి తెలంగాణా సమాజంలో వచ్చిన మార్పులను చూపించారు. ఆమె దాదాపు వంద కథలు రాశారు. ఈ కథలలో తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, తెలంగాణా సామాజిక జీవితాలను చూపించారు. ఆమె రాసిన చాలా కథల్లో పాలమూరు జిల్లా మాండలికాన్ని ఉపయోగించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పాకాల యశోదారెడ్డి ఆగస్టు 8, 1929న పాలమూరు జిల్లా (నేటి నాగర్ కర్నూలు జిల్లా) బిజినేపల్లి గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు, సంస్కృతాలలో ఎం.ఏ, డిగ్రీలు పొందారు. ఆమె 1955లో లెక్చరర్‌గా వృత్తిలోకి ప్రవేశించి ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు. యశోదారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 'తెలుగులో హరివంశాలు' అనే అంశంపై పరిశోధనచేసి పి.హెచ్.డి. పొందారు. 1990–93 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా సేవలందించారు. ఆమె చేసిన సాహిత్య కృషిని గుర్తించి ఆగ్రా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. భాగవత సుధ, నారదీయం వంటి రచనలు ఆమె కీర్తిని రెండింతలు చేశాయి. ఆమె భర్త పాకాల తిరుమలరెడ్డి చిత్రకళా రంగంలో పేరుగాంచారు. యశోదారెడ్డి పి.హెచ్.డి. పూర్తయిన తరువాత అలీఘర్ విశ్వవిద్యాలయం నుంచి డి.లిట్ అందుకున్నారు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతోపాటు జర్మన్ భాషలో డిప్లొమా పొందారు.

యశోదారెడ్డి కథలతోపాటు ఎన్నో వ్యాసాలు రాశారు. అలాగే ఉగాదికి ఉయ్యాల, భావిక వంటి వచన కవితా సంపుటాలను వెలువరించి ప్రతిభ చాటుకున్నారు. ఆమె నిత్య అధ్యయనశీలిగా ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను నిశితంగా పరిశీలనా దృష్టితో అధ్యయనం చేశారు. ఆమె కొంతకాలం కల్పనాశ్రీ పేరుతో రచనలు చేశారు. ఆమెపై ఆమె గురువు ఆచార్య దివాకర్ల వేంకటావధాని ప్రభావముంది. ఆమె సాహిత్య విమర్శలో నిక్కచ్చినంగా వ్యవహరించేవారు. ఆమె రచనలలో తెలంగాణా పలుకుబళ్ళు, సామెతలు ఉపయోగించేవారు.

ఆమె పరిశోధనగావించిన 'తెలుగులో హరివంశాలు' వంటిది మరొకటి లేదు. ఈ గ్రంథం ఉత్తమ పరిశోధనా గ్రంథంగా పండితులచే ప్రశంసలందుకుంది. 'మా ఊరి ముచ్చట్లు' పేరుతో వెలువరించిన కథా సంపుటిలోని కథలన్నీ దక్కన్ రేడియోలోను, ఆల్ ఇండియా రేడియోలోను ప్రసారమయ్యాయి. ఆమె కథను ప్రారంభించే తీరు, కథను నడిపించే తీరు ముగింపు అన్నీ ఆకట్టుకునే విధంగా ఉంటాయి. 'గంగిరేగి చెట్టు' అనే కథను ఇలా ప్రారంభిస్తారు యశోదారెడ్డి.

'ఎచ్చమ్మ నుదుటిన దేవుడు రాత సరిగ్గా రాయలేదని అందరూ అనుకునేవారు. ఆ పిల్ల పుట్టడమే పాడు నక్షత్రంలో పుట్టింది. పుట్టాక తల్లిని కబలించింది. తండ్రి కాశిరెడ్డికి అందుకనే కూతురంటే రోత, భయం, అసహ్యం, కాని తన కడుపునేగా పుట్టింది. అందుకనే బావిలో పడేయలేక పాలమూరులో తెలిసినవాళ్ళు పెంచుకుంటామంటే ఇచ్చాడు. ఇంకో పెళ్ళి చేసుకున్నాడు. బిజినేపల్లిలో పెత్తనం చెలాయిస్తూ ఉన్నాడు.' ఇలా ప్రారంభించి కథను నడిపిస్తారు. ప్రతి సంక్రాంతికి కాశిరెడ్డి చెల్లెలు ముత్యాలమ్మ తన కొడుకు రఘునాథరెడ్డిని తీసికొని వచ్చి నెలరోజులు అన్న ఇంట్లోనే ఉండిపోతుంది. వచ్చిన ప్రతిసారీ 'అన్నా మనది రక్త సంబంధం. ఈ సంబంధం కొనసాగలె' 'నీ బిడ్డల్లో ఒక దాన్ని నా కొడుక్కు యివ్వు' అంటుంది. ఎచ్చమ్మకు తొమ్మిదేళ్ళు వచ్చేసరికి తండ్రి నోట్లోంచి ఊడిపడి నట్లు తయారైంది. ఈసారి వచ్చినప్పుడు ఏమనుకుందో ఏమో పిల్ల తండ్రి దగ్గరకు వెళ్ళి భుజాలు పట్టుకుని ఊపుతూ 'నాయనా' అని ప్రేమగా పిలిచింది. అంతే తండ్రి మనసు నీరయింది. నింక నిన్ను వదిలి ఉండనమ్మా ఎచ్చాలు అని వెంట తెచ్చుకున్నాడు. చెల్లెలు కొడుక్కి ఎచ్చమ్మనిస్తే బాగుంటుందనుకున్నాడు. చెల్లెలు ఈ నిర్ణయానికి మొదట కలవరపడింది. పాడు నక్షత్రంలో పుట్టిన పిల్లను నా కొడుక్కి ఇచ్చి చేస్తాడంటున్నాడేంది కాశిరెడ్డన్న అనుకుంది మనసులో. కాని అన్న అధికారంతో, డబ్బు హోదాతో తనకు పని. పిల్లతో ఏం పని అని సర్ది చెప్పుకుంది. ఎచ్చమ్మ పాలమూరులో ఇంగ్లీషు చదువుతుంది ఎచ్చా నాకు ఆంగ్రేజ్ నేర్పవే అని బావ అడుగుతాడు. మొదట కొడుకు ఇంగ్లీషు నేర్చుకుంటుంటే సంబరపడింది ముత్యాలమ్మ. అంతలోనే అనుమానమొచ్చింది. వేలడంత లేదు పోరి అని కలవరపడింది. అన్నా! నీకు, నీ సంబంధానికి దండం, నీ సంబంధం మాకొద్దు అటూ కొడుకును తీసుకొని వెళ్ళిపోయింది ముత్యాలమ్మ. కాశిరెడ్డి మనసు విరిగిపోయింది. దీంతో ఎచ్చమ్మను మళ్ళీ పాలమూరు పంపడానికి నిర్ణయించుకుంటాడు. ఈ సంబంధం వద్దు. ఎచ్చాల్ని మళ్ళీ పాలమూరు పంపించెయ్యి అని భార్యకు చెప్పి కాశిరెడ్డి బయటకు పోతాడు. అలాగని నిర్ణయం అయిపోయింది. అయితే 'ఆ ఒక్క నిర్ణయంతో ఆ పిల్ల భవిష్యత్‌లో శుభోదయం' అంటూ కథను ముగిస్తారు యశోదారెడ్డి. ఇలా ఒక పద్ధతి ప్రకారం కథను నడపడంలో ప్రతిభ చూపించారామె.

సంఘంలోని దురాచారాలను వ్యతిరేకిస్తూ తన కథలతో ఒక సందేశాన్నిస్తూ సాహిత్య సృజనగావించిన పాకాల యశోదారెడ్డి అక్టోబర్ 7, 2007న కన్ను మూశారు.


(నియోగికి కృతజ్ఞతలు)





# విజయవాడ అనుసరికి దేశబంధు అయ్యదేవర కాళేశ్వరరావు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు అను ఉద్దండులిరువుల పేరులు స్మృతిపథంలోకి వస్తాయ్

1. ప్రజాహిత కార్యక్రమాలను చేసిన ప్రజలు శ్రేయోగాములు దేశబంధు అయ్యదేవర కాళేశ్వరరావు
2. ఎందరెందరో మహా రచయితల్ని, పత్రికా సంపాదకులుగా తీర్చిదిద్దిన దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు



విజయవాడను శ్యామల కోమల విమల సాహితీ క్షేత్రంగా రూపొందించడంలో అహరహమూ కృషి చేసిన మహనీయులూ, మహానుభావులు. స్వార్థమెరుగని పరమార్థ పురుషులు. సుగన శీలవంతులు, సౌజన్యశీలురు! ప్రజాసేవ పరమార్థ మెరిగినవారు. వీరిరువురితో పోల్చతగిన మహనీయులెవరూ లేరు. విజయవాడ నగరాభివృద్ధికి అహరహమూ చేసిన యిరువురి కృషి అణువణువునా కనిపిస్తుంది. నభూతో నభవిష్యతి అని కూడా అనాలి.

శ్రీకాళేశ్వరరావుగారి స్వగ్రామం కృష్ణాజిల్లా నందిగ్రామం. 1881 సంవత్సరం జనవరి 22న జన్మించారు. లక్ష్మయ్య, వరలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. వారి ప్రాథమిక విద్యాభ్యాసమంతా నందిగ్రామంలోనే జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రప్రథమ అసెంబ్లీ శాసనసభాధ్యక్షులుగా అయ్యదేవర కాళేశ్వరరావుగారికి కీర్తి కిరీటం తొడిగారు

దేశబంధు అని పేర్కొనదగిన మహాపురుషుడు అయ్యదేవర కాళేశ్వరరావు. తనకు పిత్రార్జితముగా సంక్రమించిన 128 ఎకరముల భూమిని రాజకీయములకే వెచ్చించిన నిష్కళంక దేశభక్తుడు. ఆగర్భ శ్రీమంతుడైన కాళేశ్వరరావు తన యావదాస్తినీ ప్రజాసేవకే వినియోగించారు. జీవితంలోని అధిక కాలం కారాగృహాల్లోనే గడిపారు. వీరి స్మృతి చిహ్నంగా విజయవాడ పౌరులు ఆయన పేరున ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడలోని వన్‌టౌను మార్కెట్‌కు కాళేశ్వరరావు మార్కెట్ అనే పేరు పెట్టారు.

నా చిన్నతనంలో చింతపల్లు రామమూర్తి పాడిన ఓ గ్రామఫోను రికార్డులో అయ్యదేవర కాళేశ్వరుడూ కాశీనాధుని నాగేశ్వరుడూ అంటూ పేర్లను ధ్వనిస్తూ గ్రామఫోన్ రికార్డు పదే పదే వినిపించేది. ఆ రికార్డును వింటూ పరవశించేవాణ్ణి. ఆ రికార్డు ప్రారంభంలో ఆంధ్రదేశం మిఠాయ్ కొంటే ఆట్టే ఖర్చూ కాదు, తింటే తింటే నోరూరించే తీయని మిఠాయ్, ఆంధ్ర మిఠాయ్ అని ప్రారంభమయేది. అయ్యదేవరా కాళేశ్వరుడూ, కాశీనాధుని నాగేశ్వరుడూ అంటూ విన సొంపుగా ఉండేది. ఎందరెందరో తీపి మనుష్యులూ త్యాగతపోధనులూ అంటూ కీర్తి చాటిందా ఆంధ్ర మిఠాయ్ రికార్డు. ఊరు ఊరా ఉర్రూతలూగించింది. మారు మూలలా శివార్లలోనూ ఎడతెరపి లేకుండా గ్రామఫోను రికార్డును వేసేవారు. అయ్యదేవర కాళేశ్వరరావు దీనబంధు, దేశబంధు. విజయవాడలోని అణువణువూ ఆయన కృషిచేసిన అభివృద్ధి కనిపిస్తుంది. ఇహ దేశబంధూ కాశీనాధుని నాగేశ్వరరావు దేశోద్ధారకుడు. ఆయన అమృతాంజన్‌పై సంపాదించిన సంపాదనంతా దీనజన సేవకూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఆంధ్ర పత్రికకూ, భారతి మాస పత్రికకూ ప్రజాహిత కార్యక్రమాలకూ ఖర్చుపెట్టారు. మంచి సినిమాల ప్రదర్శన కోసం దుర్గా కళామందిర్ పేరిట శాశ్వత సినిమాథియేటర్‌ను నిర్మించారు. ఆంధ్ర పత్రిక ద్వారా, ఆంధ్ర గ్రంథమాల గ్రంథాల ద్వారా ఎందరెందరో రచయితల్ని ప్రోత్సహించారు. 'భారతి' మాస పత్రిక ద్వారా సారస్వత సాహిత్యాన్ని ప్రోత్సహించారు. ఎందరో సాహితీవేత్తలను ప్రోత్సహించారు.

కాశీనాధుని నాగేశ్వరరావుగారు మంచి రచయిత. ఆయన స్వయంగా భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. శుద్ధ ఖద్దరు దుస్తులను మాత్రమే ధరించారు. ఖద్దరు వస్త్ర పరిశ్రమను ఎంతగానో ప్రోత్సహించారు. ఎందరో రాజకీయ నేతలను రాజకీయాలకు అతీతంగా ప్రోత్సహించారు. కానీ ఆయన రాజకీయాలను పట్టించుకోలేదు. ఆయన ప్రజల మనిషి, ప్రజల హితైషి. ఆనాడు ఆంధ్ర రాయలసీమల మధ్య రాజకీయ సన్నిహితత్వమేర్పరచిన 'శ్రీబాగ్' ఒడంబడికకు స్ఫూర్తినిచ్చారు. ఇప్పటికీ మైలాపూర్ లజ్‌లో ఆ ఒడంబడిక జరిగిన భవనమునకు 'శ్రీబాగ్' అని పేరు పెట్టారు. అటు వెళ్ళిన వారికి ఆ పేరు కనిపిస్తుంది. అంతటి మహత్తర చరిత్రకల మరొకరు అయ్యదేవర కాళేశ్వరరావు.

రాజకీయాలతోపాటు గ్రంథ ప్రచురణలో కాళేశ్వరరావుగారు ఎంతో కృషి చేసారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో డిగ్రీ పొంది 'లా' చదివారు. 1906లో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. కొమర్రాజు లక్ష్మణరావుగారు నెలకొల్పిన విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిలో కార్యదర్శిగా పనిచేసారు. జైలులో ఉన్నప్పుడు ఫ్రెంచి చరిత్ర, ఈజిప్టు చరిత్ర గ్రంథాలను రచించారు. విజయవాడ నేలనందు అణువణువునా ఆయన కృషి కనిపిస్తుంది. విజయవాడ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తూ నగరంగా తీర్చిదిద్దిన కృషి కాళేశ్వరరావుగారిదే.

కాళేశ్వరరావుగారి కృషితోనే విజయవాడ అభివృద్ధి చెందింది. విజయపరమైన వాడయ్యింది. ఆయన ఆగర్భ శ్రీమంతుడు. గాంధీ విధానములననుసరించి కారా గార శిక్షననుభవించారు. పిత్రార్జితమైన 125 ఎకరముల భూమిని రాజకీయాలకే వినియోగించిన నిష్కళంక దేశభక్తుడు. దేశసేవాపరాయణుడూ స్వార్థమెరుగనివాడు. 1956 సం॥లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినపుడు శ్రీకాళేశ్వరరావుగారి సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన్ను ప్రప్రథమ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకుని వారికి రాష్ట్రప్రజలు కృతజ్ఞతలు చెప్పారు.

ఆయన మచ్చలేని రాజకీయ నాయకుడు, మర్మమెరుగని వాడు. ఓట్ల లెక్కింపు మరుసటి రోజనగా 1962 సం॥ము ఫిబ్రవరి 26 రాత్రి ఆయన దివంగతులైనారు. అలా ఆంధ్రజాతి ఒక ముఖ్యమైన త్యాగపురుషుణ్ణి కోల్పోయినది.

స్త్రీజాతి, హరిజనోద్ధరణల కోసమై తన ఆస్తిలోని మూడుకోట్ల విలువైన భూమిని నేషనల్ హైవేరోడ్ కోసం దాన మొసగిన కీర్తి కాళేశ్వరరావుగారి కొక్కరికే దక్కింది. అలాటి దాత సంస్కరణాభిలాషీ, హరిజనోద్ధారకుడూ మరియొకడు లేడనిపించుకున్న అయ్యదేవర కాళేశ్వరుడు ప్రాతఃస్మరణీయుడు. తెలుగువాడనే ప్రతీవాడూ ఉదయం లేవగానే ఆయన్ను స్మరించుకుంటూ తొలి నమస్కారం పెట్టాలి. కృతజ్ఞతను తెలుపుకోవాలి.



# వృద్ధుల పట్ల పిన్నలు బాధ్యత వహించాలి

క్రమశిక్షణ మనిషికే కాదు, సమాజానికి కూడా చాలా అవసరం. క్రమశిక్షణ ఉన్న వ్యక్తి పరిపూర్ణత సాధించగలిగినట్లే. క్రమశిక్షణ కలిగిన సమాజం వేగంగా పురోభివృద్ధి సాధిస్తుంది. క్రమశిక్షణలేనివారికి ఇతరులను ఎలా గౌరవించాలో ఎందుకు గౌరవించాలో తెలీదు. ఎంతో శిక్షణకీ, క్రమశిక్షణకీ మారుపేరైన బౌద్ధ సంఘాల్లో కూడా కొందరు క్రమశిక్షణ లేకుండా ఉండేవారు. ఇతర భిక్షువులను ఇబ్బందిపెట్టేవారు.

అలాంటి వారు కొందరు వైశాలి ఆరామంలో ఉండేవారు. రాత్రి ధమ్మప్రబోధం అయిపోగానే, అందరినీ నెట్టుకుంటూ ముందుకుపోయి, పడక ప్రదేశాల్ని ఎంచుకునేవారు. నెమ్మదిగా వచ్చినవారికి పడక ప్రదేశం దొరికేది కాదు. వారు వారివారి ప్రదేశాల్లోనే కాకుండా ఇంకొన్ని ప్రదేశాల్లో కూడా వస్త్రాలు వేసి, 'ఇది మా మిత్రునికి', 'ఇది మా గురువు గారికి', 'ఇది ఫలానా వారికి!' అంటూ ఆక్రమించేవారు.

ఒక రోజున భిక్షు సంఘంలో వయోవృద్ధుడైన సారిపుత్రునికే పడుకోడానికి చోటు దొరకలేదు. మరికొందరు వృద్ధులకూ చోటు దొరక్క వాళ్ళు విహారం బయట ఉన్న చెట్ల కిందకు చేరాల్సి వచ్చింది.

బుద్ధుడు తెల్లవారకముందే లేచి, అటుగా వచ్చి, చెట్ల కింద కూర్చుని కునుకుతీస్తున్న వారిని చూశాడు. అక్కడ అటూ ఇటూ తిరుగుతున్న సారిపుత్రుణ్ణి చూశాడు. 'ఇక్కడెందుకు ఉన్నారు?' అని వారిని అడిగారు. వారు విషయం చెప్పారు. ఆ రోజు ఉదయాన్నే భిక్షు సంఘం మొత్తాన్ని సమావేశపరిచాడు. తన ధర్మ ప్రబోధం ముగించి–

'భిక్షువులారా! కూర్చునే చోటు, పడుకొనే చోటు విషయంలో, మంచినీటి విషయంలో, భోజనాన్ని అందుకొనే విషయంలో, ఎవరికి మొదటి అర్హత ఉంటుంది. మనం ఎవరికి అగ్రాసనం ఇవ్వాలి?' అని అడిగాడు.

'భగవాన్! క్షత్రియ కులం నుండి భిక్షువైన వ్యక్తికి!' అన్నారు కొందరు.

'కాదు భగవాన్! బ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తికి!'

'లేదు భగవాన్! వైశ్యకులం నుండి భిక్షువైన వానికి!'

'కానేకాదు. వినయ పిటకం తెలిసి, వినయాన్ని పాటించే భిక్షువుకి'

'ధ్యాన సాధన చేసి, జ్ఞానాన్ని పొందిన వ్యక్తికి'

'మూడు విద్యలు తెలిసిన వ్యక్తికి' అంటూ ఒక్కొక్కరూ ఒక్కొక్క వ్యక్తికి అగ్రాసనం ఇవ్వాలని చెప్పారు.

అప్పుడు బుద్ధుడు 'లేదు నా ధర్మంలో వీరెవరూ అగ్రాసనానికి అర్హులు కారు. నా మార్గంలో ముందుగా ఎవరు భిక్షు దీక్ష గ్రహించారో, వయస్సులో వృద్ధులో వారే అగ్రాసనానికి అర్హులు. గౌరవించాల్సిందీ, నమస్కరించాల్సిందీ వారినే!' అని వివరించారు. 'నివాసం, ఆసనం, ఆహారం, జలం, వస్త్రం– ఇలాంటి విషయాల్లో ఆ పెద్దలకే ముందు అవకాశం ఇవ్వాలి. వారు పొందిన తర్వాతే మిగిలినవారు పొందాలి. మీరు ఇక నుండి పడక ప్రదేశాల్ని ముందుగా వెళ్ళి ఆక్రమించుకోవడం తగదు. ముందుగా వృద్ధులకు చోటు లభించాక... ఆ తర్వాతే మిగిలినవారికి!' అనే నియమం విధించారు. ఈ ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించినవారికి ఎక్కువ జీవితానుభవం ఉంటుందనీ, ఎక్కువ జ్ఞానాన్ని పొంది ఉంటారని, అందుకే వారిని గౌరవించాలనీ బుద్ధుడు ప్రబోధించాడు. ఇక, అప్పటి నుంచి పెద్దలను గౌరవించడమే కాకుండా, ప్రబోధానంతరం క్రమశిక్షణతో ఆరామంలోకి వెళ్ళి, వరుస ప్రకారం పడక ఏర్పాటు చేసుకొనేవారు. భిక్షువులు చోటు ఆక్రమించే అలవాటు పూర్తిగా మారిపోయింది.

**– బొర్రా గోవర్ధన్**

# ప్రపంచంలో ఎక్కడా లేని భావసంపద ఒక్క భారత భాషలోనే ఉన్నది

భారతకాలమానంలో హోరా అనగా ఒక గంట. ఆ హోరా నుండీ పుట్టినదే హవర్ Hour. రోజుకు 24 హవర్లు, అనగా 24 గంటు. 24 గంటలు అనేది ఒక రోజు. నిరంతరమూ పనిచేస్తున్నవాణ్ణి 24 గంటలూ పనిచేసేవారని అర్థం. అలా నిరంతరమూ ఇరవై నాలుగు గంటలూ మంచి ఆలోచించేవారి నోట మంచి మాటలే వస్తాయ్. అలా నిరంతరమూ శ్రమించే స్వామి వివేకానంద చికాగో నగరం సభలో 'అమెరికా సోదర సోదరీమణులారా' అని తొలిపదం పలికే సరికి సభలోనివారంతా చకితులైపోయారు. విస్మయానంద భరితులయ్యారు. చెవులు రిక్కించి నిశబ్దాన్ని పాటిస్తూ, ఆయన వచనాన్ని ప్రవచనంగా భావించారు. అపార గౌరవ ఆప్యాయతలను చూపారు. అదే గోకులనందుడు నందవనంలో ప్రియ సఖులారా! – అని పలికేసరికి పశువులు కూడా పరవశించాయ్. పాలు తాగుతున్న దూడలు కూడా ఒక్క క్షణం పాటు పాలు త్రాగడం మాని వీక్షించాయ్. అందుకే పిలిచితే పలుకుతావట– అనే చరణం ఉద్భవించింది. జ్ఞాన సంపద సముద్భవించింది. అదే నాదంలో కల ఆనందం బ్రహ్మానందమై ఉత్పత్తి అవుతుంది. జ్ఞానమే నాదం! నాదమే జ్ఞానం. దానం వినా వినసొంపయి నది లేదు. బ్రహ్మానందమైంది. వివేకానందుణ్ణి బ్రహ్మానందం పొందేలా చేసింది.

ప్రపంచంలో ఏ దేశానికి లేని జ్ఞాన సంపద ఒక్క భారతదేశంలోనే ఉన్నది!

కాల విభజన చేసి చెప్పినది భారతదేశమే. ఎన్నో వేల లక్షల సంవత్సరాల నుంచీ భారతేతర దేశాలవారికి గ్రహాల గురించిగానీ, నవగ్రహాల గురించిగానీ తెలియదు. ఏ రోజు ఎప్పుడు సూర్యోదయమవుతుందీ, ఎప్పుడు సూర్యాస్తమవుతుందీ అన్న విషయం తెలియదు. ఎప్పుడు చంద్రగ్రహణం, ఎప్పుడు సూర్య గ్రహణం అన్న విషయాలు అసలే తెలియవు. ఏ కార్తెలో ఏ పంటలు పండించాలన్నది అసలే తెలియదు. ఇటువంటివన్నీ భారతీయులకు కరతలామలక విజ్ఞానం. టెలిస్కోపులు వంటి పరికరాలు లేకుండా కనుగొని సాధించారు.

వారానికి ఏడు రోజులు, ఏడురోజులకు ఏడుపేర్లు ఏడు హోరాలు బట్టి నిర్ణయించారు. అవి వరుసగా శని, గురుడు, కుజుడు, రవి, శుక్ర, బుధ, చంద్రహోరాలన్నవి చాలామందికి తెలియవు. ఒక నిర్దిష్టమయిన రీతుల్లో భారత ఋషులు వాటిని నిర్ణయించారు. ఆ పేర్ల నిర్ణయానికి శాస్త్రీయ కారణాలను వారు చూపెట్టారు. ఇక్కారణంగానే అవి యిప్పటికిని ప్రామాణికంగా ఉన్నాయ్.

# ద్వేషం అంటే భయమే



రెండోది ఉన్నది అనుకోవడం వల్లనే భయం కలుగుతోంది. ఉన్నది ఒక్కటే అనుకోవాలి. ఉన్నదంతా ఒకే పదార్థం. దాన్నే మనవాళ్ళు 'దేవుడు' అన్నారు. కనపడుతున్న జగత్తంతా దైవ స్వరూపమే. జగత్తు రూపంలో కనిపిస్తున్నది దేవుడు. అప్పుడు వ్యక్తుల పట్ల రకరకాల శక్తుల పట్ల ఉండే భయాలు, ద్వేషాలు అన్నీ తొలగిపోతాయి. క్రమంగా తగ్గిపోతాయి. ఎదుట వ్యక్తి పట్ల ఒక అభిప్రాయాన్ని ముందే ఏర్పరచుకున్నప్పుడు మన ద్వేషం వల్ల వారిని ఇబ్బందైనా పెడతాం లేక వారిపట్ల పిచ్చి అభిమానాన్ని పెంచుకుంటే మోసానికి గురవుతాం. ఈ మోహానికి గురవడాన్ని 'ప్రలోభం' అంటారు. ద్వేషం పెట్టుకోవడాన్ని 'భయం' అంటారు. వారిని ఎందుకు ద్వేషిస్తున్నావంటే వారికి భయపడుతున్నామని అర్థం. వారి మాయలో ఎందుకు పడుతున్నామంటే వారంటే ఇష్టపడుతున్నారని అర్థం. రెండోది లేదు, ఉన్నదంతా ఒక్కటే అనడానికి మంచి ఉదాహరణ భాగవతంలో ఉంటుంది. విశ్వం వేరు, విష్ణువు వేరు అనుకున్నాడు హిరణ్యకశిపుడు. విష్ణువుని జయించాలనుకున్నాడు. కాబట్టి భయపడ్డాడు. ఆ భయాన్ని పోగొట్టుకోవడానికి ప్రహ్లాదుణ్ణి బాధపెట్టాడు. విశ్వమంతా విష్ణువుగా భావించాడు ప్రహ్లాదుడు.

**తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుడు మాటిమాటి కో**
**పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా**
**పన్నశరణ్య! యో నిఖిలపావన! యంచు నుతించునుగాని తా**
**గన్నుల నీరుదేడు భయకంప సమేతుడు గాడు భూవరా!**

ఎంత అందమైన పద్యం ఇది! ఎన్నిసార్లు చదువుకోవాలి. భయమేస్తే ఈ పద్యం చదువుకోండి. మీకు భయం కలిగితే వ్యాసుడు ఓడిపోయినట్టే! పోతన ఓడిపోయినట్టే! అంత మంచి పద్యమిది.

శూలాలతో పొడుస్తూ ఉంటే, ఏనుగులతో తొక్కిస్తూ ఉంటే, పర్వతంపై నుంచి తోసేస్తూ ఉంటే, సముద్రంలో పడేసి ముంచేస్తూ ఉంటే 'రక్షించండి' అనలేదు ప్రహ్లాదుడు. ఎంత ధైర్యం! ఏమా భగవత్ విశ్వాసం. తనను పొడుస్తున్న శూలాల్లోనే భగవంతుడిని చూశాడు ప్రహ్లాదుడు. విష్ణుసహస్రనామంలో 'విశ్వం విష్ణుః' అంటే అర్థం అది. హిరణ్యకశిపుడు అది చూడలేదు.

ప్రహ్లాదుడు పుట్టక ముందు హిరణ్యకశిపుడు తపస్సు చేయడానికి వెళ్ళాడు. లోకాలు జయించాలన్నది అతని కోరిక. ఆయన తపస్సు చేస్తుంటే లోకాలన్నీ తల్లడిల్లాయి. ఎలా తల్లడిల్లాలయో పోతన ఒక పద్యంలో ఇలా చెబుతాడు.

**అదిరెం, గుంభిని, సాద్రియై, కలిగె నే డంబోనిధుల్, తారకల్**
**చెదరెన్ సగ్రహసంఘులై, దిశలు విచ్ఛిన్నాంతలై మండె బె**
**ల్లదరన్ గుండెలు జంతుసంహతికి నుగ్రాధార దైత్యేంద్రమూ**
**ర్ధదిశోద్ధూత సధూమ హేతిపటలదంచత్త పోవహ్నిచేన్**

అతడు ఉగ్రాచారంలో ఉన్నాడు. వేరే చూపు లేకుండా, వేరే ఆలోచన లేకుండా, వేరే బుద్ధి లేకుండా, వేరే వినికిడి లేకుండా తపస్సు చేస్తుంటే, మూర్ధభాగం నుంచి అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి. అవి కత్తుల్లా ఉన్నాయి. వాటి ప్రభావానికి పంచ భూతాలు అల్లాడిపోయాయి. ఆ తపఃశక్తికి పర్వతాలతో సహా భూమి కంపించింది. సముద్రాలన్నీ అల్లకల్లోలమయ్యాయి. గ్రహాలతో సహా చెదిరిపోయాయి. దిశల చివరి భాగాల్లో అగ్ని ప్రజ్వరిల్లించింది. అన్ని జీవుల గుండెలు అదిరిపోయాయి. బ్రహ్మదేవుడు వస్తే ఏం కోరతాడో అని పంచభూతాలు భయపడిపోతున్నాయి. వాడికి ఆ విషయం తెలియదు.

**– డా॥ గరికిపాటి నరసింహారావు గారికి కృతజ్ఞతలతో**

## అ, అం అః అను అక్షరత్రయమే అఖిల విద్యలకు మూల కారణం!

అ అం అః వినా ఏ శబ్దాక్షర స్వరమూ అక్షరాల సమహారం కాలేదు సుస్వరభరితమైన పై అక్షఋత్రయం భాషా స్వర సౌరభం సుసంపన్నంగా వర్థిల్లినదంతే. అందుకు శబ్ధోక్షారణం కూడా కారణం.

అందుకే పెద్దలు 'అ' అక్షరమున కంతటి అనంత ప్రాముఖ్యత మొసగారు. అక్షరమునకే అంతటి శక్తివంత శక్తి ఉందంటూ– 'అక్షరంబు తల్లి అఖిల విద్యలకున్' అనే వొక్క వాక్యంతో శక్తివంతం చేసి చెప్పారు. 'అక్షరంబు లోక రక్షకంబు' అంటూ అక్షరకాంతి నుద్దీపింపచేసారు. అక్షర సమహారమైన చదువే కాంతివంతము క్రాంతిపథ శక్తిని కలిగిస్తుంది.

అ అం అంటూ తల్లి క్షీరాన్న గోరుముద్దలను నోటికందిస్తూ తినిపిస్తుంది. పాలబువ్వ ముద్దలలో అనంతమైన ప్రాథమిక విజ్ఞానాన్ని నోటికందిస్తుంది. తల్లి అంటే తొలి గురువు అన్నాడొక పరమపురుషుడు. ఆమె తినిపించే 'గోరుముద్దలలోనే అనంతమైన విజ్ఞానం శరీరగోళంలోకి ప్రవేశిస్తుంది' అంటాడాయన.

నా చిన్నతనములో నా తల్లీ, తోటి బాల తల్లులు చందమామను చూపిస్తూ వెండి కంచాలలో వేడి బువ్వందోయి మా బుజ్జిబాబుతో తినగరావోయ్' అంటూ చందురునికి గోరుముద్దను చూపిస్తూ చంకలోని పిల్లలకు గోరుముద్దను చేత బట్టుకుని అ ఆ అం అంటూ నోరు తెరమవమని చిన్నచిన్నగా ముద్దలుగా చేసి గోటితో బిడ్డ నోటిలో పెట్టేవారు. వాటినే గోరుముద్దలు అంటారు. తీరుగా గోటి ముద్దలతోనే పిల్లలు నోటిలో అం ఆ ఆ అంటూ పెట్టడం నా చిన్ననాటే చూసాను. ఇప్పుడా గోటిముద్దలూ లేవు. అ అం అః యని నోటపలికేవారు లేరు.

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై